ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
గురువారం, 20 ఆగస్టు 2026 | సంపుటి: 02 సంచిక: 07 | పేజీలు: 8 వెల: 5


టీడీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు అరెల్లి కిరణ్ గౌడ్. కార్యదర్శి నాగరాజు, కోశాధికారి వంశీ

## డిజిటల్ జర్నలిస్టులకు సమాన హక్కులు కల్పించాలి

- ప్రత్యేక అక్రిడిటేషన్.. రక్షణ, సంక్షేమం అందించాలి
- దాడులు, బెదిరింపులపై ప్రత్యేక రక్షణ వ్యవస్థ ఉండాలి
- ప్రభుత్వం ప్రత్యేక డిజిటల్ మీడియా పాలసీ తీసుకురావాలి
- రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను ఏకతాటిపైకి తెస్తాం
- టీడీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు అరెల్లి కిరణ్ గౌడ్
- సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి : కార్యదర్శి నాగరాజు
- తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ ఆవిర్భావం

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** డిజిటల్ మీడియా జర్నలిస్టులకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో సమానంగా హక్కులు, గుర్తింపు, రక్షణ, సంక్షేమం కల్పించాలని తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ అధ్యక్షుడు అరెల్లి కిరణ్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. డిజిటల్ మీడియా విస్తరిస్తున్న నేపథ్యంలో జర్నలిస్టుల హక్కులు, బాధ్యతలు, సంక్షేమాన్ని స్పష్టంగా నిర్వచించేలా ప్రత్యేక డిజిటల్ మీడియా పాలసీని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న డిజిటల్ మీడియా ప్రతినిధులను ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు.

**టీడీఎంయూ రాష్ట్ర కార్యవర్గం**

తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్(టీడీఎంయూ)కు సంబంధించిన రిజిస్ట్రేషన్ (రిజిస్ట్రేషన్ నంబర్ 468 ఆఫ్ 2026) ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో సభ్యులు నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా అరెల్లి కిరణ్, కార్యదర్శిగా పల్లెబోయిన నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.యూనియన్ ఉపాధ్యక్షుడిగా కౌడగాని మోహన్‌రావు,

........(తరువాయి 2లో)

## రైతు వద్దకే బ్యాంకులు వెళ్లాలి

- సకాలంలో రుణం.. పెరగాల్సింది రైతు ఆదాయం
- వ్యవసాయ అనుబంధ రంగాలకూ విస్తృతంగా రుణాలు
- 2047 లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకింగ్ వ్యూహం
- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** రైతు రుణం కోసం బ్యాంకు చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, బ్యాంకింగ్ వ్యవస్థే రైతుల వద్దకు వెళ్లాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతుకు రుణం ఇవ్వడం మాత్రమే కాకుండా.. ఆ రుణం ద్వారా అధిక, స్థిరమైన వ్యవసాయ ఆదాయం సమకూరేలా బ్యాంకింగ్


........(తరువాయి 2లో)

### పోలీస్ నియామకాల్లో

## అక్రమాలకు చెక్

- పోలీస్ నియామకాల్లో అక్రమాలకు చెక్
- ప్రతి అభ్యర్థికి ప్రత్యేక యూనిక్ ఐడీ
- దరఖాస్తు నుంచి ఉద్యోగం వరకు పూర్తి వివరాల నమోదు
- అభ్యంతరాలు, ఫిర్యాదులకు సులువుగా పరిష్కారం
- నియామక ప్రక్రియలో మరింత పారదర్శకతకు చర్యలు

3



## రికవరీకి మంగళం

### రెండేళ్లుగా మిల్లర్లపై క్రిమినల్ చర్యలు

- విజిలెన్స్ సోదాలతో బయటపడుతున్న పాత బకాయిల బాగోతం
- 5.40 లక్షల టన్నుల ధాన్యం.. రూ.1,080 కోట్ల విలువ
- 25 శాతం ఫైన్‌తో రూ.1,350 కోట్లకు చేరిన భారం
- కొన్ని జిల్లాల్లో కేసులు.. మరికొన్ని చోట్ల రికవరీకి బ్రేక్
- దశాబ్దకాలపు సీఎంఆర్ లెక్కలపై సమగ్ర ఆడిట్‌కు సర్కారు నిర్ణయం

2

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :**

రైస్ మిల్లర్లపై కేసులు పెట్టారు.. అరెస్టులు చేశారు.. జరిమానాలు విధించారు.. మరి ప్రభుత్వానికి రావాల్సిన ధాన్యం, బియ్యం ఎంత రికవరీ అయ్యాయి? కేసుల దర్యాప్తు ఎక్కడి వరకు వచ్చింది? ఎఫ్ఐఆర్‌లు నమోదైన తర్వాత చార్జిషీట్లు దాఖలయ్యాయా? ఆస్తుల జప్తు జరిగిందా? అనే ప్రశ్నలు ఇప్పుడు మరోసారి తెరపైకి వస్తున్నాయి. రెండేళ్లుగా కొందరు మిల్లర్లపై క్రిమినల్ చర్యలు కొనసాగుతున్నా.. పాత బకాయిల వ్యవహారం పూర్తిగా కొలిక్కి రాకపోవడం, తాజాగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సోదాలు ముమ్మరం కావడం చర్చనీయాంశంగా మారింది. 2022-23 యాసంగి టెండర్ ధాన్యం వ్యవహారంలో రాష్ట్రంలోని 30 జిల్లాల్లో 314 రైస్ మిల్లుల్లో 5.40 లక్షల టన్నుల ధాన్యం నిల్వలు కనిపించలేదని విజిలెన్స్ గుర్తించింది. ఆ ధాన్యం విలువ టెండర్ రేటు ప్రకారం సుమారు రూ.1,080 కోట్లు కాగా.. 25 శాతం జరిమానా కలిపితే రూ.1,350 కోట్లకు చేరుతుంది. అయినా అన్ని జిల్లాల్లో కేసులు, అరెస్టులు, రికవరీ ఒకే తీరులో జరగకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**కేసుల చిట్టా.. రికవరీ ఎంత?**

ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ కోసం మిల్లర్లకు అప్పగించిన ధాన్యాన్ని నిర్దేశిత గడువులో మరఆడించి సీఎంఆర్ బియ్యంగా తిరిగి ఇవ్వాలి. అలా ఇవ్వకుండా ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు తేలిన సందర్భాల్లో అధికారులు క్రిమినల్ కేసులతోపాటు రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలకు దిగుతున్నారు. గతంలోనే రెండు సంవత్సరాలు దాటిన సీఎంఆర్ బకాయిలపై క్రిమినల్ కేసులు పెట్టాలని పౌరసరఫరాల సంస్థ ఆదేశించిన ఉదంతాలున్నాయి. 2022లోనే 13 రైస్ మిల్లులపై కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ కాగా, వాటిలో హనుమకొండ, వరంగల్, పెద్దపల్లి తదితర జిల్లాల మిల్లులు కూడా ఉన్నాయి. తాజాగా కూడా పలు జిల్లాల్లో కేసులు నమోదవుతున్నాయి. వనపర్తి జిల్లాలో 29 మంది మిల్లర్లపై క్రిమినల్ కేసులు, ఐదు మిల్లుల యజమానులపై

........(తరువాయి 2లో)

## ఫీనిక్స్ నుంచి పొంగులేటికి ఆస్తులు

- కంపెనీ నుంచి మంత్రికి రూ.15వేల కోట్ల ఆస్తుల బదలాయింపులు
- ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నా
- దమ్ముంటే చర్చకు రావాలి
- 22ఏ భూముల వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్

7






## 22ఏ భూములపై సీఐడీ విచారణ జరపాలి

- లక్షలాది మంది జీవితాలతో ఆడుకుంటున్నారు
- తెలంగాణ భవన్‌లో 10 మంది న్యాయవాదులతో ఉచిత లీగల్ సెల్
- 20, 30 శాతం కమీషన్లు ఇవ్వొద్దు.. తక్కువ ధరకు ఆస్తులు అమ్ముకోవద్దు
- స్పందించకపోతే బాధితులతో కలిసి సీఎం ఇంటి ముట్టడి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు డిమాండ్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** లక్షలాది మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్న 22ఏ నిషేధిత భూముల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీఐడీ విచారణకు ఆదేశించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. చిన్న చిన్న అంశాలకే సీఐడీ, విజిలెన్స్ విచారణలు చేపట్టే సీఎం రేవంత్‌రెడ్డి.. వేలాది ఎకరాల భూములు 22ఏ జాబితాలో చేరిన వ్యవహారంపై ఎందుకు

........(తరువాయి 2లో)



## ప్రిన్సిపల్ హత్య కేసులో మైనర్లే నిందితులు!

- చోరీకి వెళ్లి గుర్తుపట్టడంతో కత్తితో 27 సార్లు దాడి
- రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ స్వాధీనం
- 70 సీసీ కెమెరాల పరిశీలనతో ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

3

## సవాళ్లకు తగ్గట్టుగా పోలీసు పునర్వ్యవస్థీకరణ

### ట్రాఫిక్, రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం

- గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ నుంచి 513 మంది బదిలీ
- డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ప్రత్యేక దృష్టి
- రెండు నెలల అటాచ్‌మెంట్ అనంతరం కొత్త బాధ్యతలు : డీజీపీ సీవీ ఆనంద్



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :**

మారుతున్న నేర స్వభావం, ప్రజా భద్రతకు ఎదురవుతున్న కొత్త సవాళ్లకు అనుగుణంగా తెలంగాణ పోలీసు శాఖలో మానవ వనరులను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాదం ప్రధాన సవాళ్లుగా ఉండగా.. ప్రస్తుతం డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, ట్రాఫిక్, రోడ్డు భద్రత, ఆహార కల్తీ వంటి అంశాలు కీలక సవాళ్లుగా మారాయని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ తదితర ప్రత్యేక విభాగాల నుంచి 513 మంది సిబ్బందిని ఎనిమిది విభాగాలకు అవసరాల మేరకు కేటాయించినట్లు డీజీపీ తెలిపారు. వీరిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలు, 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించారు. ఆహార కల్తీ, డ్రగ్ కంట్రోల్‌కు 80 మంది, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు 79 మంది, సివిల్ సప్లయిస్‌కు 28 మంది, డీజీపీ కార్యాలయం-టీ స్పార్క్‌కు 27 మంది కేటాయించారు.

........(తరువాయి 2లో)



## తెలంగాణలో దూసుకెళ్తున్న ఈవీలు

- రాయితీలతో పెరిగిన కొనుగోళ్లు..
- ఏడాదిలో 91,107 వాహనాలు
- కొత్త వాహనాల నమోదులో 8.8 శాతం వాటా
- కార్లలో ఈవీల వాటా 12.5 శాతం
- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌లోనే 68 శాతం నమోదు

7

## మంత్రి కొండా సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు

- సుస్మిత వ్యాఖ్యలపై వివరణ కోరిన కమిటీ
- మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశం
- సీఎం రేవంత్, ఎమ్మెల్యే రేవూరిపై వ్యాఖ్యలపై సీరియస్
- మాజీ మంత్రి చిన్నారెడ్డికి కూడా నోటీసులు

3



# రైతు వద్దకే బ్యాంకులు వెళ్లాలి

(మొదటిపేజీ తరువాయి)

వ్యూహాలు ఉండాలని సూచించారు. తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కీలక భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో జరిగిన 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు.




**రుణం కాదు.. రైతు ఆదాయమే కొలమానం**

బ్యాంకులు నిర్దేశించిన రుణ లక్ష్యాలను ఎంత వరకు సాధించాయన్నది మాత్రమే కాకుండా.. ఆ రుణాలతో వ్యవసాయ ఉత్పాదకత ఎంత పెరిగింది, గ్రామీణ ఆదాయం ఎంత మెరుగుపడింది, ఎన్ని పరిశ్రమలు వచ్చాయి, ఎన్ని ఉద్యోగాలు సృష్టించబడ్డాయి, ఎంత ప్రైవేట్ పెట్టుబడి సమీకరించబడిందన్నదే బ్యాంకింగ్ పనితీరుకు అసలైన కొలమానమని భట్టి విక్రమార్క అన్నారు. రైతులకు అవసరమైన సమయంలోనే రుణాలు అందాలని చెప్పారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర అనుబంధ రంగాలను కూడా అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావాలని సూచించారు. జూన్ 2026 నాటికి వ్యవసాయ రంగానికి బ్యాంకులు రూ.52,337 కోట్ల రుణాలు అందించడం అభినందనీయమన్నారు. అయితే రుణాలు సకాలంలో అందడమే ముఖ్యమని స్పష్టం చేశారు. రైతు రుణాన్ని తిరిగి చెల్లించలేకపోతే కేవలం రికవరీ చర్యలకే పరిమితం కాకుండా.. రైతు ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించాలని సూచించారు. ఉత్పాదకత, మార్కెట్ సదుపాయాలు, కోత అనంతర వసతులు, వర్కింగ్ క్యాపిటల్ వంటి అంశాలను కూడా రుణ వ్యూహంలో భాగం చేయాలని చెప్పారు.

**ఎంఎస్ఎంఈలకు సకాలంలో నిధులు**

తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) కీలక పాత్ర పోషిస్తాయని భట్టి విక్రమార్క అన్నారు. రుణం మంజూరు కావడం కంటే అవసరమైన సమయంలో నిధులు చేతికి అందడం వ్యాపారులకు ముఖ్యమని పేర్కొన్నారు. రుణ దరఖాస్తు, మంజూరు, పంపిణీ ప్రక్రియకు స్పష్టమైన కాలపరిమితి ఉండాలని సూచించారు. సీజీటీఎంఎస్ఈ కింద ఈ త్రైమాసికంలో రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదం పొందడం అభినందనీయమన్నారు. ఈ పథకం కింద రుణాలు పొందే వ్యాపారులను పూచీకత్తు నిబంధనల పేరుతో ఇబ్బంది పెట్టవద్దని బ్యాంకర్లను కోరారు.

**క్యూర్, ప్యూర్, రేర్‌కు ప్రత్యేక రుణ వ్యూహాలు**

తెలంగాణ రైజింగ్ 2047లోని క్యూర్, ప్యూర్, రేర్ విధానాలకు అనుగుణంగా ప్రాంతాల అవసరాలను బట్టి ప్రత్యేక రుణ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. క్యూర్ ప్రాంతాల్లో ఏఐ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, ఏరోస్పేస్, స్టార్టప్‌లు, నాలెడ్జ్ రంగాలకు ఆధునాతన ఫైనాన్సింగ్ అవసరమన్నారు. ప్యూర్ ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, పారిశ్రామిక క్లస్టర్లు, గృహ నిర్మాణం, మౌలిక వసతులకు నిధులు అందించాలని చెప్పారు. రేర్ ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, డెయిరీ, ఫిషరీస్, గ్రామీణ పరిశ్రమలకు సకాలంలో, సరసమైన రుణాలు అందించాలన్నారు. రాష్ట్రంలో 19.13 లక్షల జనధన్ ఖాతాల్లో జీరో బ్యాలెన్స్ ఉండటం ఆందోళనకరమన్నారు. కేవలం ఖాతాలు తెరవడం కాకుండా పొదుపు, బీమా, రుణాల వైపు ప్రజలను ప్రోత్సహించడమే నిజమైన ఆర్థిక సమ్మిళితం అని చెప్పారు. గ్రామాల్లో నిష్క్రియాత్మకంగా ఉన్న బిజినెస్ కరస్పాండెంట్లను వెంటనే క్రియాశీలం చేయాలని లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రతి గ్రామానికి బ్యాంకింగ్ సేవలు అందించాలని ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలను మైక్రో ఎంటర్‌ప్రైజ్‌లుగా తీర్చిదిద్దేందుకు 'ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్' అందించాలని సూచించారు.

**'తెలంగాణ రైజింగ్ 2047' బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్**

తెలంగాణ రైజింగ్ 2047కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్ రూపొందించాలని భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. వ్యవసాయ ఉత్పాదకత ఆధారిత రుణాలు, ఎంఎస్ఎంఈలు-స్టార్టప్ ఫైనాన్స్, మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ పరిశ్రమలు, యువత ఉపాధి ఆధారిత రుణాలు, గ్రీన్-క్లైమేట్ ఫైనాన్స్, డిజిటల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్, జిల్లాల మధ్య క్రెడిట్ వ్యత్యాసాల నివారణ, దీర్ఘకాలిక మౌలిక వసతుల ఫైనాన్స్, కొత్త పరిశ్రమలు, సాంకేతిక రంగాలకు సంబంధించి వార్షిక లక్ష్యాలను అందులో పొందుపరచాలని అన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను కేవలం ప్రభుత్వ వ్యయంతో సాధించడం సాధ్యం కాదని, భారీ ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు, లోతైన ఆర్థిక మార్కెట్లు, వినూత్న నిధుల విధానాలు అవసరమని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్లు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజల సమగ్ర వికాసంలో బ్యాంకింగ్ రంగం భాగస్వామి కావాలని కోరారు. సమావేశంలో పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈవో దివ్య, నాబార్డ్ సీజీఎం చిన్మయ్‌కుమార్, ఎస్‌బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ సతీష్‌కుమార్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, డీఎఫ్ఎస్ డైరెక్టర్ మానస గంగోత్రి తదితరులు పాల్గొన్నారు.

# సవాళ్లకు తగ్గట్టుగా పోలీసు పునర్వ్యవస్థీకరణ



(మొదటిపేజీ తరువాయి)

ఏసీబీ, సీఐడీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు 25 మంది చొప్పున కేటాయించారు.

**రెండు నెలల అటాచ్‌మెంట్.. 11 రోజుల శిక్షణ**

కొత్త బాధ్యతలు అప్పగించే ముందు సిబ్బందిని ఆయా విభాగాల్లో రెండు నెలలపాటు అటాచ్‌మెంట్‌పై పనిచేయించినట్లు సీపీ ఆనంద్ తెలిపారు. ప్రభుత్వ అనుమతితో పోస్టుల ఏర్పాటుకు అనుగుణంగా తుది కేటాయింపులు చేశామన్నారు. సిబ్బంది విద్యార్హతలు, అనుభవం, నేపథ్యాన్ని పరిశీలించడంతోపాటు వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. కొత్త విభాగాల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ అకాడమీలో 11 రోజుల ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు.

**తీవ్రవాదం నుంచి సైబర్ నేరాల వరకు**

1980, 1990 దశకాల్లో తెలంగాణలో వామపక్ష తీవ్రవాదం ప్రధాన సవాలుగా ఉండేదని డీజీపీ గుర్తుచేశారు. అప్పటి అవసరాలకు అనుగుణంగా 1987లో ప్రత్యేక పోలీసు విభాగం ఏర్పడి, అదే క్రమంలో గ్రేహౌండ్స్ రూపుదిద్దుకుందని తెలిపారు. గ్రేహౌండ్స్, ఎస్ఐబీ తదితర విభాగాలు మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణలో కీలక పాత్ర పోషించాయని చెప్పారు. 2017 తర్వాత తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. 2007లో హైదరాబాద్‌లో లుంబినీ పార్క్, చార్మినార్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడుల నేపథ్యంలో కౌంటర్ టెర్రరిజం సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడిందని, దాని ఫలితంగానే ఆక్టోపస్ వంటి ప్రత్యేక విభాగాలు బలోపేతమయ్యాయని వివరించారు. యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని డీజీపీ అన్నారు. గతేడాది 835 మంది విద్యార్థుల్లో డ్రగ్స్ ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. మరో విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అధ్యయనంలో సుమారు 70 శాతం మంది విద్యార్థులు డ్రగ్స్‌కు గురైనట్లు తేలిందని చెప్పారు. డ్రగ్స్ సరఫరా గొలుసును అడ్డుకోవడంతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**సైబర్ నేరాల్లో రూ.1,750 కోట్ల నష్టం**

ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, నకిలీ యాప్‌ల ద్వారా జరుగుతున్న మోసాలతో సైబర్ నేరాలు ప్రధాన సవాలుగా మారాయని సీవీ ఆనంద్ తెలిపారు. గత ఏడాది రాష్ట్రంలో సైబర్ నేరాల కారణంగా సుమారు రూ.1,750 కోట్ల ఆర్థిక నష్టం జరిగినట్లు చెప్పారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక విభాగాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తాజా పునర్వ్యవస్థీకరణలో రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు డీజీపీ తెలిపారు. గత ఏడాది తెలంగాణలో రోడ్డు ప్రమాదాల్లో సుమారు 8 వేల మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, అమలును బలోపేతం చేసేందుకు 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు సేఫ్టీ విభాగానికి కేటాయించినట్లు వెల్లడించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ఇంజినీరింగ్ లోపాలను సరిదిద్దేందుకు సంబంధిత శాఖలతో కలిసి పనిచేస్తామని తెలిపారు. కొత్త బాధ్యతలు చేపడుతున్న సిబ్బంది నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని డీజీపీ సూచించారు. శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవడంతోపాటు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని చెప్పారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల్లో ఫీల్డ్ ఆపరేషన్లు, శిక్షణ తదితర అవసరాలకు సరిపడా సిబ్బందిని కొనసాగించినట్లు తెలిపారు. మూడు నెలల అనంతరం సిబ్బంది అవసరాలు, పనితీరును మరోసారి సమీక్షిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆక్టోపస్, సీఐడీ, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్ తదితర ప్రత్యేక విభాగాల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# డిజిటల్ జర్నలిస్టులకు సమాన హక్కులు కల్పించాలి



టీడీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు అరెల్లి కిరణ్ గౌడ్. కార్యదర్శి నాగరాజు, కోశాధికారి వంశీ

(మొదటిపేజీ తరువాయి)

కోశాధికారిగా పల్లె వంశీ మోహన్, సహాయ కార్యదర్శిగా బూర నగేష్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా గడ్డం కేశవమూర్తి, గౌరవ సలహాదారుగా రాజేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దాసరి ధనుంజయ, సలేంద్ర రవీందర్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా అధ్యక్షుడు కిరణ్ గౌడ్ మాట్లాడుతూ డిజిటల్ మీడియా జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సమష్టిగా పనిచేస్తుందని వారు తెలిపారు. డిజిటల్ పేపర్లలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ప్రత్యేక నిబంధనలతో అక్రిడిటేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిజిటల్ జర్నలిస్టులకు ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రెస్‌కాన్ఫరెన్సులు, అధికారిక సమావేశాలు, కలెక్టరేట్లు, పోలీస్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో వార్తా సేకరణకు సమాన అవకాశం కల్పించాలన్నారు. గుర్తింపు కార్డు కేవలం గుర్తింపునకు మాత్రమే కాకుండా విధి నిర్వహణలో రక్షణకు ఉపయోగపడేలా వ్యవస్థ ఉండాలని కోరారు.

**దాడులు.. బెదిరింపులపై రక్షణ**

అవినీతి, అక్రమాలు, మాఫియా, నేరాలు, ప్రజా సమస్యలపై వార్తలు రాసే డిజిటల్ జర్నలిస్టులు పలుచోట్ల బెదిరింపులు, దాడులు, ఆన్‌లైన్ వేధింపులు ఎదుర్కొంటున్నారని కిరణ్ గౌడ్ తెలిపారు. విధి నిర్వహణలో జర్నలిస్టులపై దాడులు జరిగితే వెంటనే స్పందించేలా ప్రతి జిల్లాలో ప్రత్యేక నోడల్ అధికారి లేదా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులపై విధి నిర్వహణకు సంబంధించిన కేసులు నమోదైనప్పుడు చట్టపరమైన సహాయం అందించేందుకు ప్రత్యేక లీగల్ ఎయిడ్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. జర్నలిస్టులకు సురక్షిత పని వాతావరణం కల్పించడంతోపాటు సైబర్ వేధింపులు, ట్రోలింగ్, బెదిరింపులపై వేగంగా చర్యలు తీసుకునే విధానం అవసరమన్నారు.

**డిజిటల్ మీడియాకు ప్రత్యేక పాలసీ**

డిజిటల్ మీడియా కేవలం సోషల్ మీడియా కాదని, వార్తా సేకరణ, వాస్తవ నిర్ధారణ, విశ్లేషణ, ప్రచురణలో వృత్తిపరమైన ప్రమాణాలతో పనిచేస్తున్న జర్నలిజం విభాగమని కిరణ్ గౌడ్ పేర్కొన్నారు. డిజిటల్ జర్నలిస్టుల గుర్తింపు, రక్షణ, సంక్షేమానికి ప్రత్యేక విధానం రూపొందించాలన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఫ్యాక్ట్ చెకింగ్, ఏఐ టెక్నాలజీ, డేటా జర్నలిజం, డిజిటల్ ఫోరెన్సిక్స్, క్రైమ్, ఎన్నికల కవరేజీ తదితర అంశాల్లో ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డిజిటల్ జర్నలిస్టులకు సమాన హక్కులు, సమాన గుర్తింపు, సమాన రక్షణ, సమాన సంక్షేమం కల్పించడమే యూనియన్ లక్ష్యమని స్పష్టం చేశారు. డిజిటల్ మీడియా కేవలం సోషల్ మీడియా కాదని, వార్తా సేకరణ, వాస్తవ నిర్ధారణ, విశ్లేషణ, ప్రచురణలో వృత్తిపరమైన ప్రమాణాలతో పనిచేస్తున్న జర్నలిజం విభాగమని కిరణ్ గౌడ్ పేర్కొన్నారు. డిజిటల్ జర్నలిస్టుల గుర్తింపు, రక్షణ, సంక్షేమానికి ప్రత్యేక విధానం రూపొందించాలన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఫ్యాక్ట్ చెకింగ్, ఏఐ టెక్నాలజీ, డేటా జర్నలిజం, డిజిటల్ ఫోరెన్సిక్స్, క్రైమ్, ఎన్నికల కవరేజీ తదితర అంశాల్లో ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డిజిటల్ జర్నలిస్టులకు సమాన హక్కులు, సమాన గుర్తింపు, సమాన రక్షణ, సమాన సంక్షేమం కల్పించడమే యూనియన్ లక్ష్యమని స్పష్టం చేశారు.

**సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి : కార్యదర్శి నాగరాజు**

ప్రభుత్వం అమలు చేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్య, సంక్షేమ పథకాలకు అర్హులైన డిజిటల్ జర్నలిస్టులను కూడా చేర్చాలని కార్యదర్శి నాగరాజు కోరారు. ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, అత్యవసర వైద్య సహాయం, విధి నిర్వహణలో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సాయం, పిల్లల విద్యకు తోడ్పాటు వంటి సంక్షేమ చర్యలు అందించాలన్నారు. దీర్ఘకాలంగా జర్నలిజంలో కొనసాగుతున్న వారికి వృద్ధాప్య సామాజిక భద్రత, అర్హులైన వారికి గృహ వసతి, ఇళ్ల స్థలాల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

# 22ఏ భూములపై సీఐడీ విచారణ జరపాలి

(మొదటిపేజీ తరువాయి)

విచారణకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. 22ఏ బాధితులు ఎవరూ ఆందోళన చెందవద్దని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

**22ఏ వెనుక భారీ దందా**

తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేధిత భూముల వల్ల నష్టపోయిన బాధితులతో హరీశ్‌రావు ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో చేర్చడం వెనుక 30 శాతం కమీషన్లు, 50-50 సెటిల్మెంట్ల దందా ఉందని ఆరోపించారు. హెచ్ఎండీఏ, హెచ్‌యూడీఏ ఆమోదించిన లేఅవుట్లలోని భూములను, 30 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ఇళ్లను కూడా 22ఏలో చేర్చడం వెనుక పెద్ద మొత్తంలో కమీషన్ల వ్యవహారం నడుస్తోందని అన్నారు. బుద్వేల్ సర్వే నంబర్లు 282, 283, 284లోని 30 ఎకరాల భూమిని సర్వే సెటిల్‌మెంట్ డైరెక్టర్‌పై ఒత్తిడి తెచ్చి రాత్రికి రాత్రే 22ఏ నుంచి తొలగించి కోట్లాది రూపాయల దందా చేశారని ఆరోపించారు. శేరిలింగంపల్లి సర్వే నంబర్లు 20/1, 21లోని SAS ఇన్‌ఫ్రా ప్రాపర్టీని 30 శాతం కమీషన్‌తో 22ఏ నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లు చేయించారని, బిల్డర్ పని పూర్తయిన తర్వాత మళ్లీ 22ఏలో చేర్చారని పేర్కొన్నారు.

**40 వేల ఎకరాలపై సీఎం ఎందుకు మౌనం?**

యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను 22ఏలో చేర్చారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాలుగు నెలల క్రితమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెప్పినా ఆయన ఎందుకు స్పందించలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ వ్యవహారం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలిసి ఆడుతున్న వసూళ్ల నాటకమని ఆరోపించారు. పొంగులేటి కొద్ది రోజుల క్రితం ఒక్క ఎకరం కూడా 22ఏలో చేర్చలేదని చెప్పారని, ఇప్పుడు అధికారుల పొరపాటేనని చెబుతున్నారని అన్నారు. ఇలాంటి భిన్నమైన ప్రకటనలతో ప్రజలను ఎందుకు గందరగోళానికి గురిచేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు రియల్ ఎస్టేట్ వ్యాపారం తెలిసి ఉండొచ్చని.. బీఆర్ఎస్ నాయకులకు ప్రజల తరఫున పోరాటాలు చేయడం తెలుసని వ్యాఖ్యానించారు.

**బాధితులకు ఉచిత న్యాయ సహాయం**

22ఏ బాధితులకు అన్ని రకాల న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ భవన్‌లో 10 మంది న్యాయవాదులతో ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు హరీశ్‌రావు ప్రకటించారు. అడ్వకేట్ కళ్యాణ్‌ను సంప్రదిస్తే ఉచిత న్యాయ సేవలు అందిస్తారని తెలిపారు. లీగల్ సెల్ సహాయంతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అధికారులతో, కలెక్టర్లతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యే వరకు బాధితుల వెంట ఉంటారని చెప్పారు. ఎవరూ భయపడి 20, 30 శాతం కమీషన్లు ఇవ్వొద్దని, ఆస్తులను తక్కువ ధరలకు అమ్ముకోవద్దని సూచించారు. ప్రభుత్వం చేసిన తప్పును ప్రభుత్వమే సుమోటోగా స్వీకరించి ఆన్‌లైన్‌లో 22ఏ ఆంక్షలను తొలగించాలని డిమాండ్ చేశారు. అమీన్‌పూర్ కేఎస్ఆర్ కాలనీలో సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ 500 ఇళ్లను 22ఏలో చేర్చి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.

**స్పందించకపోతే సీఎం ఇంటి ముట్టడి**

2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో సీలింగ్ రద్దయిన భూముల్లో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అనుమతులతో నిర్మించిన ఇళ్లను కూడా ఇప్పుడు సీలింగ్ భూములుగా పేర్కొనడం దుర్మార్గమని హరీశ్‌రావు అన్నారు. అక్రమంగా 22ఏ జాబితాలో చేర్చిన భూములన్నింటినీ వెంటనే పునరుద్ధరించాలని, ఇందుకు బాధ్యులైన అధికారులపై, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డికి ఈ వ్యవహారంతో సంబంధం లేకపోతే పొంగులేటిని తక్షణమే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని అన్నారు. ప్రభుత్వం ఒకటి రెండు రోజుల్లో స్పందించకపోతే బాధితులతో కలిసి పెద్ద ఎత్తున సీఎం ఇంటి ముట్టడి చేపడతామని హరీశ్‌రావు హెచ్చరించారు. సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రికవరీకి మంగళం

(మొదటిపేజీ తరువాయి)

ఆర్ఆర్ యాక్టు కింద కేసులు నమోదైనట్లు 2025లో అధికారులు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లాలో 2026 మార్చిలో ఇద్దరు మిల్లర్లపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసిన ఉదంతం కూడా ఉంది. అయితే కేసులు పెట్టిన తర్వాత ప్రభుత్వానికి తిరిగి వచ్చిన ధాన్యం ఎంత? బియ్యం ఎంత? నగదు రూపంలో ఎంత వసూలైంది? అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది.

**విజిలెన్స్ సోదాలతో పాత లెక్కలు**

2022-23 యాసంగికి సంబంధించి పౌరసరఫరాల సంస్థ వేలం వేసిన ధాన్యంలో కొంతమేర మిల్లర్ల వద్ద లేకపోవడంతో ఫిర్యాదులు రావడం, అనంతరం విజిలెన్స్ తనిఖీల్లో 314 మిల్లుల్లో 5.40 లక్షల టన్నుల ధాన్యం కనిపించకపోవడం ఈ వ్యవహారానికి కేంద్ర బిందువుగా మారింది. ఆ సమయంలోనే నోటీసులు, న్యాయపరమైన చర్యలతోపాటు 25 శాతం జరిమానాతో ధాన్యాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. అయితే రికవరీ మాత్రం అన్ని జిల్లాల్లో ఒకే వేగంతో సాగలేదు. కొన్ని జిల్లాల్లో కేసులు, అరెస్టులు జరిగితే.. మరికొన్ని చోట్ల రికవరీ నత్తనడకన సాగిందన్న విమర్శలు వచ్చాయి. ఆంధ్రజ్యోతి గతంలో వెల్లడించిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌లో రూ.340 కోట్ల విలువైన ధాన్యం మిల్లర్ల వద్ద పక్కదారి పట్టినట్లు గుర్తించినా, అప్పటివరకు సుమారు రూ.4 కోట్ల విలువైన ధాన్యమే రికవరీ అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మాత్రం కేసులతోపాటు రికవరీ చర్యలు కూడా కొనసాగినట్లు సమాచారం.

**25 శాతం ఫైన్.. ఒత్తిళ్లు ఎందుకు?**

పాత బకాయిలను రికవరీ చేసేందుకు ప్రభుత్వం 25 శాతం జరిమానా విధించే నిర్ణయం తీసుకుంది. సీఎంఆర్ బకాయిలపై 25 శాతం జరిమానాతోపాటు 12 శాతం వడ్డీ కూడా వసూలు చేయాలని 2026 ఏప్రిల్‌లో పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బకాయిలు చెల్లించిన మిల్లర్లకే కొత్తగా ధాన్యం కేటాయించాలని కూడా స్పష్టం చేసింది. ఈ నిర్ణయంపై రైస్ మిల్లర్ల సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. మిల్లర్లు నష్టాల్లో ఉన్నందున 25 శాతం జరిమానా, 12 శాతం వడ్డీ భారాన్ని తగ్గించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తాజాగా విజిలెన్స్ సోదాలు ముమ్మరం కావడంతో తనిఖీలు నిలిపివేయాలని, ఫైన్ తగ్గించాలని మిల్లర్ల ప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నట్లు క్లిప్పింగ్‌లోనూ ప్రస్తావన ఉంది. అయితే ప్రభుత్వ ధాన్యం విషయంలో రికవరీ కంటే ముందు ఒత్తిళ్లకు తలొగ్గితే భవిష్యత్తులోనూ ఇదే పరిస్థితి పునరావృతమయ్యే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**కేసులు పెట్టినా.. ఫైళ్లు కదిలాయా?**

క్రిమినల్ కేసు నమోదు చేయడం ఒక దశ మాత్రమే. ఆ తర్వాత దర్యాప్తు పూర్తి చేయడం, నిందితులపై అభియోగాలు నమోదు చేయడం, అవసరమైతే ఆస్తులను అటాచ్ చేయడం, ప్రభుత్వానికి రావాల్సిన ధాన్యం లేదా దాని విలువను రికవరీ చేయడం తదుపరి చర్యలు. కానీ జిల్లాలవారీగా ఈ ప్రక్రియలో స్పష్టమైన తేడాలు కనిపిస్తున్నాయి. 2025లో పౌరసరఫరాల శాఖ సీఎంఆర్ బకాయిలపై ఆర్ఆర్ యాక్టును ప్రయోగించడంతోపాటు కుటుంబ సభ్యుల ఆస్తుల జప్తునకు కూడా చర్యలు చేపట్టిన సందర్భాలున్నాయి. మరోవైపు కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత తదుపరి దర్యాప్తు, బకాయిల రికవరీపై స్పష్టత లేకపోవడం ప్రశ్నలకు తావిస్తోంది. తాజాగా తెలంగాణ హైకోర్టులోనూ సీఎంఆర్ బకాయిలు, డిఫాల్టర్ జాబితా, క్రిమినల్ కేసులకు సంబంధించిన వివాదాలు విచారణకు వచ్చినట్లు న్యాయస్థాన రికార్డులు సూచిస్తున్నాయి.

**మిల్లర్ల బకాయిలపై దశాబ్దం లెక్క**

ఇది ఒక్క 2022-23 సీజన్‌కు మాత్రమే పరిమితమైన వ్యవహారం కాదన్నది తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో స్పష్టమవుతోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి గత పది నుంచి పన్నెండేళ్ల సీఎంఆర్ వ్యవస్థపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించినట్లు ఆగస్టు 4న ప్రచురితమైన సమాచారం వెల్లడించింది. ధాన్యం సేకరణ నుంచి మిల్లర్లకు కేటాయింపు, సీఎంఆర్ బియ్యం అప్పగింత, డిఫాల్టర్లు, పెండింగ్ బకాయిలు, రికవరీలు, విజిలెన్స్ కేసులు, న్యాయపరమైన చర్యలు అన్నింటినీ పరిశీలించనున్నారు. ఇది జరిగితే ఇన్నేళ్లుగా పేరుకుపోయిన బకాయిల అసలు చిట్టా బయటపడే అవకాశం ఉంది. ఏ మిల్లుకు ఏ సీజన్‌లో ఎంత ధాన్యం ఇచ్చారు? ఎంత బియ్యం రావాలి? ఎంత వచ్చింది? ఎంత బకాయి ఉంది? ఎన్ని నోటీసులు ఇచ్చారు? ఎన్ని కేసులు పెట్టారు? ఎంత రికవరీ చేశారు? అన్నది మిల్లర్ వారీగా తేల్చే అవకాశం ఉంటుంది.

**5.40 లక్షల టన్నుల లెక్క ఎప్పటికి?**

ప్రస్తుతం అందరి దృష్టి 5.40 లక్షల టన్నుల ధాన్యం రికవరీపైనే ఉంది. 314 మిల్లుల్లో నిల్వలు కనిపించలేదని విజిలెన్స్ గుర్తించిన నేపథ్యంలో.. ఆ ధాన్యం ఎక్కడికి వెళ్లింది? ఎవరు విక్రయించారు? దాని ద్వారా వచ్చిన మొత్తం ఎక్కడికి చేరింది? ప్రభుత్వానికి రావాల్సిన సొమ్ము ఎంత? అన్న ప్రశ్నలకు పూర్తిస్థాయి సమాధానాలు రావాల్సి ఉంది. ఒకవైపు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతుండగా.. మరోవైపు కొన్ని జిల్లాల్లో రికవరీ నెమ్మదిగా సాగుతుండటం విమర్శలకు తావిస్తోంది. పెద్దపల్లిలో ఇటీవల కేసులు, అరెస్టులతో అధికారులు దూకుడు పెంచారు. అక్కడ కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం బకాయిలపై చర్యలు కొనసాగుతున్నాయి. కేసులు పెట్టడం మాత్రమే కాదు.. కేసుల ఫలితం ఏమిటి? రికవరీ ఎంత? ప్రభుత్వానికి నష్టం ఎంతవరకు పూడింది? అన్నదే ఇప్పుడు అసలు కొలమానం. దశాబ్దకాలపు సీఎంఆర్ లెక్కల ఆడిట్ నేపథ్యంలో పాత ఫైళ్లు తెరుచుకుంటే.. మిల్లర్ల బాధ్యతతోపాటు పర్యవేక్షించిన అధికారుల పాత్ర కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. విజిలెన్స్ సోదాలు, క్రిమినల్ కేసులు, 25 శాతం జరిమానా, ఆర్ఆర్ యాక్టు చర్యలు ఇకపై ఏ దిశగా సాగుతాయన్నదే ఆసక్తికరంగా మారింది.



# ఇంటర్ బోర్డు కార్యాలయంలో ముగిసిన విజిలెన్స్ సోదాలు

- **నాలుగు గంటల పాటు తనిఖీలు.. కీలక దస్త్రాలు స్వాధీనం**
- **మాజీ కార్యదర్శి అశోక్‌ను విచారించిన అధికారులు**

**కాకతీయ, హైదరాబాద్:** నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేపట్టిన సోదాలు ముగిశాయి. సుమారు నాలుగు గంటల పాటు కొనసాగిన తనిఖీల్లో పలు కీలక దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సోదాల్లో భాగంగా మాజీ కార్యదర్శి అశోక్‌ను అధికారులు విచారించారు. 2019 ఇంటర్మీడియట్ ఫలితాల్లో గ్లోబరీనా సంస్థకు సంబంధించిన అవకతవకలు, మార్కుల నమోదులో జరిగిన తప్పిదాల కారణంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ వ్యవహారంపై సీఎం ఆదేశాలతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు దర్యాప్తులో భాగంగా బుధవారం ఇంటర్ బోర్డు కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న దస్త్రాలను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.

# దమ్ముంటే రేవూరితో రాజీనామా చేయించి రండి

**రేవంత్ వచ్చినా.. రేవూరి తాత వచ్చినా పరకాలలో పోటీ చేస్తా**

**సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మితా పటేల్ తీవ్ర వ్యాఖ్యలు**



కాకతీయ, గీసుకొండ : కొండా ఇలాకాలోకి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ కుటుంబంపై ఎందుకు మాట్లాడుతున్నారని కొండా సుస్మితా పటేల్ ప్రశ్నించారు. దమ్ముంటే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి వచ్చినా.. రేవూరి ప్రకాశ్‌రెడ్డి కుటుంబం నుంచి ఎవరొచ్చినా పరకాలలో తాను పోటీ చేసి గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. గీసుకొండ మండలంలోని ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సుస్మితా పటేల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పరకాల ఎన్నికలకు ముందు రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఎవరో ప్రజలకు తెలియదని సుస్మితా పటేల్ అన్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్‌రెడ్డికి కళ్లు నెత్తికెక్కాయా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవి కోరుకున్న సమయంలో తొలుత కొండా మురళీ, కొండా సురేఖ పేర్లను కోరుకున్నారని తెలిపారు. కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఆ మాట ఇచ్చారో లేదో ప్రమాణం చేయాలని సవాల్ చేశారు. హామీ ఇచ్చినప్పటికీ పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

**'దమ్ముంటే రాజీనామా చేయించి రండి'**

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో రాజీనామా చేయించి ఇప్పుడే ఎన్నికలకు రావాలని సుస్మితా పటేల్ సవాల్ చేశారు. రెండేళ్ల వరకు ఎందుకు వేచి ఉండాలని, ఇప్పుడే తేల్చుకుందామని అన్నారు. కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోయినా పరకాల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుస్తానని ప్రకటించారు. రేవంత్‌రెడ్డి వచ్చినా, రేవూరి ప్రకాశ్‌రెడ్డి తాత వచ్చినా పరకాల నుంచి పోటీ చేసి గెలుస్తానని వ్యాఖ్యానించారు. త్వరలోనే పరకాలలో ఇల్లు కట్టుకుని ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. రేవంత్‌రెడ్డికి ఇంకా కాంగ్రెస్ సంస్కృతి పూర్తిగా అబ్బలేదని సుస్మితా పటేల్ విమర్శించారు. టీడీపీ నాయకులంటే ఆయనకు ఎందుకు ఇష్టమో అర్థం కావడం లేదన్నారు. కాంగ్రెస్ ఇప్పుడు 'అచ్చ కాంగ్రెస్'కు బదులుగా 'పచ్చ కాంగ్రెస్'గా మారిపోయిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కలిసి దోచుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం బీసీ ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని పలువురు తమ వద్దకు వచ్చి చెబుతున్నారని తెలిపారు. వేం నరేందర్‌రెడ్డి గత మూడేళ్లుగా సీఎంకు ఇచ్చిన సలహాలు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. కొండా మురళీ, కొండా సురేఖ మంచివారు కాబట్టే ఇంతకాలం రేవంత్‌రెడ్డి గురించి తాము మాట్లాడలేదని, ఇకపై తాను 'చిట్టక్క'గా మాట్లాడుతున్నానని సుస్మితా పటేల్ అన్నారు. ఏఐసీసీపై తనకు గౌరవం ఉందని, అయితే రేవంత్‌రెడ్డి ఇకపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# ప్రిన్సిపల్ హత్య కేసులో మైనర్లే నిందితులు!

**చోరీకి వెళ్లి గుర్తుపట్టడంతో కత్తితో 27 సార్లు దాడి**

**రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ స్వాధీనం**

**70 సీసీ కెమెరాల పరిశీలనతో ఛేదించిన పోలీసులు**

**వివరాలు వెల్లడించిన నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**





కాకతీయ, నల్లగొండ : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో అదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులే నిందితులుగా తేలడం సంచలనం సృష్టించింది. ఈ నెల 11న జరిగిన హత్య వెనుక ఇద్దరు మైనర్లు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. స్కూల్ ఫీజుల వసూళ్లతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించిన ఇద్దరు విద్యార్థులు చోరీకి వెళ్లి.. రూపారెడ్డి గుర్తుపట్టడంతో ఆమెపై కత్తితో 27 సార్లు దాడి చేసి హత్య చేసినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. కేసు దర్యాప్తు వివరాలను ఆయన మీడియా సమావేశంలో వెల్లడించారు. కొండమల్లేపల్లి జేబీ కాలనీలో భర్త రాజేందర్‌రెడ్డితో కలిసి రూపారెడ్డి నివసించేవారు. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో భర్తతో కలిసి హైదరాబాద్ వెళ్లిన ఆమె ఆగస్టు 11న ఉదయం ఒక్కరే కొండమల్లేపల్లికి తిరిగి వచ్చారు. అదే రోజు రాత్రి ఆమె హత్యకు గురయ్యారు. జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్ ఇంట్లో చోరీకి ఐదు రోజుల ముందే పథకం వేసుకున్నారని ఎస్పీ తెలిపారు. స్కూల్‌లో ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ఇంట్లో భారీగా నగదు ఉంటుందని భావించినట్లు చెప్పారు. హత్య అనంతరం నగదు, మృతురాలి సెల్‌ఫోన్‌తో నిందితులు పరారయ్యారని వెల్లడించారు.

**70 సీసీ కెమెరాలతో ఆధారాలు**

కేసును ఛేదించేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టామని ఎస్పీ తెలిపారు. పాత నేరస్థులు, ఇతర అనుమానితులపై ఆరా తీయడంతోపాటు ప్రాంతంలోని సుమారు 70 సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించినట్లు చెప్పారు. హత్య అనంతరం నాలుగు రోజులపాటు పాఠశాలకు సెలవులు ప్రకటించారని, తిరిగి పాఠశాల తెరిచిన తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థులపై పోలీసులు ఆరా తీశారని తెలిపారు. వారిలో ఐదుగురు పదో తరగతి విద్యార్థులు ఉన్నారని, ఇద్దరు విద్యార్థులు రెండు, మూడు రోజులుగా విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించామని చెప్పారు. ఒక నిందితుడి వద్ద రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నగదుపై రక్తపు మరకలు కనిపించడంతో వాటిని ల్యాబ్‌కు పంపగా మానవ రక్తమని నిర్ధారణ అయిందన్నారు.

**మందలింపుతో కక్ష.. గోవా టూర్ కూడా**

నిందితుల్లో ఒక విద్యార్థి గతంలో అదే స్కూల్ హాస్టల్‌లో ఉండేవాడని ఎస్పీ తెలిపారు. అతడి బ్యాగ్‌లో డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, ఉపాధ్యాయులు మందలించి డేస్కాలర్‌గా మార్చారని చెప్పారు. తల్లిదండ్రుల సమక్షంలో మందలించడంతో ప్రిన్సిపల్‌పై అతడికి కక్ష పెరిగిందన్నారు. ఆ విద్యార్థికి మద్యం, బైక్‌లపై మోజు ఉండటంతోపాటు నెల రోజుల క్రితం గోవా టూర్‌కు వెళ్లినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. డబ్బు సంపాదించి జల్సాలు చేయాలనే ఉద్దేశంతో ప్రిన్సిపల్ ఇంట్లో చోరీకి పథకం వేసినట్లు చెప్పారు. ఈ నెల 11న స్కూల్ నుంచి వచ్చిన అనంతరం ఇద్దరూ కలిసి ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారని, వారిలో ఒకరు మాస్క్ ధరించి గోడ దూకి లోపలికి వెళ్లాడని ఎస్పీ వివరించారు. ఈ క్రమంలో మాస్క్ తొలగిపోవడంతో రూపారెడ్డి అతడిని గుర్తుపట్టారని, దీంతో కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు. నిందితులిద్దరూ మైనర్లు కావడంతో జువైనల్ జస్టిస్ బోర్డుకు హాజరుపరుస్తామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.26.26అ


# పోలీస్ నియామకాల్లో అక్రమాలకు చెక్

**ప్రతి అభ్యర్థికి ప్రత్యేక యూనిక్ ఐడీ**

**దరఖాస్తు నుంచి ఉద్యోగం వరకు పూర్తి వివరాల నమోదు**

**అభ్యంతరాలు, ఫిర్యాదులకు సులువుగా పరిష్కారం**

**నియామక ప్రక్రియలో మరింత పారదర్శకతకు చర్యలు**




కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణలో పోలీస్ నియామక ప్రక్రియను మరింత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకురానుంది. ఇందులో భాగంగా ప్రతి అభ్యర్థికి ప్రత్యేకమైన యూనిక్ ఐడీని కేటాయించనున్నారు. అభ్యర్థి దరఖాస్తు చేసుకున్న నాటి నుంచి ఉద్యోగం పొందే వరకు నియామక ప్రక్రియలోని ప్రతి దశకు సంబంధించిన వివరాలను ఈ ఐడీతో అనుసంధానం చేయనున్నారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ, ప్రాథమిక రాతపరీక్ష, పార్ట్–1 దరఖాస్తు, తదుపరి దశకు అర్హత సాధించిన అనంతరం పార్ట్–2 దరఖాస్తు, శారీరక సామర్థ్య పరీక్ష తదితర వివరాలను యూనిక్ ఐడీలో నమోదు చేస్తారు. అభ్యర్థి ప్రతిభ, పరీక్షల్లో సాధించిన ఫలితాలు, వడపోతకు సంబంధించిన సమాచారాన్ని కూడా భద్రపరచనున్నారు.

**ఫిర్యాదులకు ఆధారంగా..**

భవిష్యత్తులో నియామక ప్రక్రియపై అభ్యంతరాలు, ఫిర్యాదులు లేదా న్యాయపరమైన వివాదాలు తలెత్తినప్పుడు యూనిక్ ఐడీ ఆధారంగా అభ్యర్థికి సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించే అవకాశం ఉంటుంది. దీంతో సమస్యలను పరిష్కరించడంతో పాటు నియామక ప్రక్రియలో అనుమానాలకు తావు లేకుండా చూడవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇతర పోటీ పరీక్షలతో పోలిస్తే యూనిఫాం సర్వీసుల నియామక ప్రక్రియలో వడపోత దశలు ఎక్కువగా ఉంటాయి. రాతపరీక్ష అనంతరం శారీరక సామర్థ్య పరీక్షలు సహా పలు దశలను అభ్యర్థులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రతి దశలో అభ్యర్థి వివరాలను యూనిక్ ఐడీతో అనుసంధానం చేయడం ద్వారా నియామకాల్లో కచ్చితత్వం, పారదర్శకత పెంచేందుకు టీఎస్ఎల్‌పీఆర్‌బీ చర్యలు చేపడుతోంది.

# కౌండిన్య గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూనూరు నిరంజన్ గౌడ్



కాకతీయ, హైదరాబాద్: కౌండిన్య గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూనూరు నిరంజన్ గౌడ్ నియమితులయ్యారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని కౌండిన్య గౌడ సంఘం కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు, న్యాయవాది కేఎల్ఎన్ ప్రసాద్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ సమాజ సేవా దృక్పథం కలిగిన నిరంజన్ గౌడ్ సంఘం బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తారనే నమ్మకంతో బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు పేద గీత కార్మికులను ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కందికంటి రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు నిరంజన్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు.

# ఫొటోజర్నలిస్టులు వార్తా పత్రికలకు 'ప్రాణం'



**ఒక ఫొటో వెయ్యి మాటలతో సమానం**

**కెమెరాతో చరిత్రను భద్రపరుస్తున్న ఫొటోజర్నలిస్టులు**

**త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు, హెల్త్ కార్డులు**

కాకతీయ, హైదరాబాద్: వార్తా పత్రికలకు ఫొటోజర్నలిస్టులు ప్రాణం వంటివారని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఒక ఫొటో వెయ్యి మాటలతో సమానమని, సమాజంలో చోటుచేసుకునే కీలక ఘటనలను భవిష్యత్ తరాలకు అందించే శక్తి ఫొటోజర్నలిస్టులకు ఉందని కొనియాడారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ స్టేట్ ఫొటోజర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం 187వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'బెస్ట్ న్యూస్ ఫొటో కాంపిటీషన్–2026'తోపాటు ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కె. శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ జి. ముకుందరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**'ఫొటోగ్రాఫర్ చరిత్రకారుడు'**

ఫొటోగ్రాఫర్ కేవలం కెమెరాను క్లిక్ చేసే వ్యక్తి కాదని.. చరిత్రను భద్రపరిచే చరిత్రకారుడని కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా తెలంగాణ స్టేట్ ఫొటోజర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక సంఘటనను ఎంత గొప్పగా రాసినా.. దానికి సంబంధించిన మంచి ఫొటో ఆ ఘటనను ప్రజల కళ్లముందు సజీవంగా నిలబెడుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, రాజకీయ పరిణామాలు, సామాజిక ఉద్యమాలు, పేదల కష్టాలు, విజయగాథలను ఫొటోజర్నలిస్టులు తమ కెమెరాల్లో బంధిస్తున్నారని చెప్పారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సంఘటనా స్థలాలకు చేరుకుని వాస్తవ పరిస్థితులను ప్రజలకు చూపించే ధైర్యం ఫొటోజర్నలిస్టుల సొంతమన్నారు. ప్రముఖుల పేర్లతో గతంలో ఏర్పాటు చేసిన ఫొటోగ్రఫీ అవార్డులను పునరుద్ధరించడం ద్వారా ఈ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వానికి సూచించారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ రంగానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

**ఫొటోతో అధికారుల స్పందన**

ఒక మంచి ఫొటో సమాజాన్ని ఆలోచింపజేయడంతోపాటు అధికారులను స్పందించేలా చేయగలదని సమాచార శాఖ కమిషనర్ జి. ముకుందరెడ్డి అన్నారు. బాధితుల సమస్యలను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లడంలో ఫొటోగ్రఫీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కాలం గడిచిపోయినా.. మనుషులు మారిపోయినా గొప్ప ఫొటో మాత్రం ఆ క్షణాన్ని శాశ్వతంగా నిలబెడుతుందని పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్ సమాజానికి నిశ్శబ్ద సాక్షి, చరిత్రకు శాశ్వత సాక్ష్యమని అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల పట్టాలు, హెల్త్ కార్డులు, అవార్డుల అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ముకుందరెడ్డి తెలిపారు. ఇళ్ల పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్, హౌసింగ్ సొసైటీల అంశాలను మీడియా అకాడమీ ద్వారా పరిశీలించి ఇప్పటికే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఇది ప్రభుత్వ పాలసీకి సంబంధించిన అంశమని, ప్రభుత్వం నుంచి నిర్ణయం వచ్చిన అనంతరం దశలవారీగా ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. ఈ నెలలోనే జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకోసం సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగులకు కార్డులు అందించిన అనంతరం జర్నలిస్టులకు కూడా ఒకేసారి అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్‌పీజేఏ ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి, ఉపాధ్యక్షులు పి. రామ్మూర్తి, టి. కిషోర్‌సింగ్, కోశాధికారి కె. అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఎం.ఎ. సర్వర్, జి. వసంత్‌కుమార్, ఎన్. శివకుమార్, మహ్మద్ అలీమొద్దీన్, ఎ. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు

**సుస్మిత వ్యాఖ్యలపై వివరణ కోరిన కమిటీ**

**మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశం**

**సీఎం రేవంత్, ఎమ్మెల్యే రేవూరిపై వ్యాఖ్యలపై సీరియస్**

**మాజీ మంత్రి చిన్నారెడ్డికి కూడా నోటీసులు**





కాకతీయ, తెలంగాణ బ్యూరో : మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలపై మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై సుస్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలను కమిటీ తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై మంత్రి కొండా సురేఖ నుంచి వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. పార్టీ నాయకత్వానికి సంబంధించిన అంశాలపై సుస్మిత చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ సీరియస్‌గా స్పందించింది. వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ వివరణ ఇవ్వాలని, మూడు రోజుల్లోగా సమాధానం సమర్పించాలని కమిటీ ఆదేశించినట్లు సమాచారం. మాజీ మంత్రి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డికి కూడా క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. వనపర్తి ఎమ్మెల్యేపై ఆయన చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కమిటీ ఆదేశించినట్లు సమాచారం. మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య బహిరంగ విమర్శలు, ఆరోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన తాజా నోటీసులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే అంశాలపై కమిటీ సీరియస్‌గా స్పందిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు..
# లేదంటే చర్యలే

- భవన నిబంధనలు పాటిస్తేనే ఓసీలు
- ఉల్లంఘనలపై కఠిన చర్యలు తప్పవు
- హంటర్ రోడ్ నుంచి నక్కలగుట్ట వరకు క్షేత్రస్థాయి తనిఖీలు
- కమిషనర్ వెంకన్న ఆకస్మిక పరిశీలనలు



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : శాంక్షన్డ్ ప్లాన్ ప్రకారమే భవనాలు నిర్మిస్తే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం హంటర్ రోడ్, ప్రకాశ్‌రెడ్డిపేట, నక్కలగుట్ట, జూలైవాడ, ఎక్సైజ్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఓసీల కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓసీ కోసం వచ్చిన భవనాల కొలతలను స్వయంగా పరిశీలించిన కమిషనర్.. మంజూరైన ప్లాన్‌కు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టారా లేదా అన్నది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భవన నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే ఓసీ జారీ చేయబోమని స్పష్టం చేశారు.

### ముందస్తు అనుమతి తప్పనిసరి

నగరంలో కొత్త భవనాలు నిర్మించే ముందు తప్పనిసరిగా బల్దియా నుంచి అనుమతి తీసుకోవాలని కమిషనర్ సూచించారు. మంజూరైన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే అనుమతులు, ఓసీలు ఇవ్వబోమని తెలిపారు. నిర్మాణాలు పూర్తయిన తర్వాతే ఓసీ కోసం దరఖాస్తు చేసుకోవాలని భవన యజమానులకు సూచించారు. భవన నిర్మాణ నిబంధనలు, ఓసీల జారీలో ఎలాంటి ఉల్లంఘనలకు తావులేకుండా క్షేత్రస్థాయి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని కమిషనర్ వెంకన్న తెలిపారు. తనిఖీల్లో సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీ ప్రశాంత్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేలు తప్పుడు
# ఆరోపణలు మానుకోవాలి




- ప్రజల విశ్వాసం కోల్పోయిన నేతలు వాస్తవాలు అంగీకరించాలి
- గత ప్రభుత్వంలో వదిలేసిన పనులను పూర్తి చేసి ప్రారంభిస్తున్నాం
- పరకాల అభివృద్ధికి రూ.484 కోట్లకు పైగా నిధులు
- బీఆర్ఎస్ సెంటిమెంట్ రాజకీయాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరు
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

కాకతీయ, హనుమకొండ : ప్రజల విశ్వాసం కోల్పోయిన మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్ తప్పుడు ఆరోపణలు చేయడం మానుకుని వాస్తవాలను అంగీకరించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు సెంటిమెంట్ రాజకీయాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరన్నారు. పరకాల 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి దాదాపు రూ.35 కోట్ల వ్యయం కాగా, గత ప్రభుత్వం కేవలం రూ.6.19 కోట్లు విడుదల చేయడంతో పనులు 16 నెలలు నిలిచిపోయాయని రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చొరవ, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మిగిలిన నిధులు విడుదల చేయించి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. గత ప్రభుత్వం శంకుస్థాపన చేసి వదిలేసిన పనులను పూర్తి చేయడం నేరమా అని ప్రశ్నించారు.

### రూ.484 కోట్లకు పైగా అభివృద్ధి పనులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరకాల నియోజకవర్గంలో రూ.484 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి అమలు చేస్తున్నామని తెలిపారు. పరకాల పట్టణానికి శాశ్వత మంచినీటి సౌకర్యం కోసం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామని, రాష్ట్రంలోనే తొలిసారిగా మహిళా డెయిరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని పేర్కొన్నారు. పరకాల నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే శంకుస్థాపన చేసి ప్రారంభించిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను అధికారంలో ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ఆయన పేరు ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఆయన స్వగ్రామం అక్కంపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు రాజకీయ సెంటిమెంట్‌తో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ హయాంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు తామే చేస్తామని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.

## రేపటి దేశ భవిష్యత్తు విద్యార్థులదే

- నాణ్యమైన విద్య, వైద్య వసతులు కల్పించాలి
- సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే మురళినాయక్ సూచన



కాకతీయ, ఇనుగుర్తి : దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వైద్య, వసతి సదుపాయాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతి గృహం, వంటగది, భోజనశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే వారి చదువు, భోజనం, వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించి, నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా తన దృష్టికి తీసుకురావాలని, పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలు చదువులో ముందంజలో ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళి నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బైరు అశోక్ గౌడ్, సర్పంచ్ కుమార్, సర్పంచులు ముదిరెడ్డి కళావతి శ్రీనివాసరెడ్డి, చెడుపాక సుజాత యాకయ్య, లక్ష్మీ వెంకన్న నాయక్, చిన్ని వెంకన్న, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నల్లబెల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

కాకతీయ, నల్లబెల్లి: మండల ప్రజల సౌకర్యార్థం జనతా ట్రస్ట్, శంకర ఐ ఫౌండేషన్ ఇండియా, శ్రీ కాంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నల్లబెల్లిలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్న వారికి వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్యుల సూచన మేరకు చికిత్స, తదుపరి వైద్య సేవలపై మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుంజా సూర్యపై తప్పుడు ప్రచారం చేశారు

- బెట్టింగ్‌కు పాల్పడుతున్నారంటూ అసత్య ఆరోపణలు
- రాజకీయాలకు అతీతంగా యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తున్నారు
- సతీష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు యువజన కాంగ్రెస్ ఫిర్యాదు



కాకతీయ, ఏటూరునాగారం : రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి కుంజా సూర్యపై మాజీ బీఆర్ఎస్ రేడ్కో చైర్మన్ వై. సతీష్‌రెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొంటూ యువజన కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుంజా సూర్య బెట్టింగ్‌కు పాల్పడుతున్నారంటూ సతీష్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మహేష్‌కు ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజకీయ భేదాలకు అతీతంగా కుంజా సూర్య యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. క్రీడా సామగ్రితో పాటు అవసరమైన వారికి ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి నాయకుడిపై ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కుంజా సూర్యపై తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇకనైనా తప్పుడు ప్రచారాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ వసంత శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గంట కృష్ణారెడ్డితో పాటు రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో
# నలుగురు సీఐలకు బదిలీలు

- ఫణీధర్‌కు నెక్కొండ సర్కిల్ బాధ్యతలు
- శంకర్‌రావుకు నర్సంపేట రూరల్-దుగ్గొండి పోస్టింగ్
- శ్రీనివాస్, సాయి రమణకు వీఆర్‌కు బదిలీ
- తక్షణమే ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశాలు




కాకతీయ, వరంగల్ బ్యూరో : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీఆర్‌లో ఉన్న కె. ఫణీధర్‌ను నెక్కొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. నెక్కొండలో పనిచేస్తున్న ఎస్. శ్రీనివాస్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా వీఆర్‌లో ఉన్న జె. శంకర్‌రావును నర్సంపేట రూరల్/దుగ్గొండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎం. సాయి రమణను వీఆర్‌కు బదిలీ చేశారు. నర్సంపేట డివిజన్‌లో బందోబస్తు విధులు పూర్తయిన అనంతరం సీఐలు సాయి రమణ, శ్రీనివాస్‌లను రిలీవ్ చేయాలని ఏసీపీ నర్సంపేటను ఆదేశించారు. ఫణీధర్, శంకర్‌రావులను వెంటనే రిలీవ్ చేసి కొత్త పోస్టింగ్‌లలో విధుల్లో చేరి రిపోర్టు చేయాలని ఏసీపీ, సీఎస్‌బీని సూచించారు.

# గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి
- తాగునీటి బావులు, బోర్లకు సోలార్ విద్యుత్ వినియోగించాలి
- నీటి సమస్యలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రతిపాదనలు పంపాలి
- గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి
- మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్



కాకతీయ, ఇనుగుర్తి : ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ సూచించారు. బుధవారం ఇనుగుర్తి రైతువేదికలో సర్పంచులు, అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో స్ట్రీట్‌లైట్లతో పాటు రక్షిత మంచినీటి బావులు, బోర్లకు సోలార్ విద్యుత్ వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సర్పంచులు తమ గ్రామాల్లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పాత బావులను పునరుద్ధరించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త బావులు, బోర్లు ఏర్పాటు చేయాలని కోరారు. నీటి ఎద్దడి నివారణకు సరైన ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే సూచించారు. చిన్ననాగారం సర్పంచ్ సుజాత యాకయ్య గ్రామంలోని రక్షిత మంచినీటి బావులకు సోలార్ మోటార్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. సోలార్ విద్యుత్ వినియోగిస్తే విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని, గ్రామాల్లో మోటార్లు, స్ట్రీట్‌లైట్లకు సోలార్ విద్యుత్‌ను వినియోగించడంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

### ఆరుతడి పంటల వైపు రైతులు

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులను ఆరుతడి పంటల సాగు వైపు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కోరారు. నీటి వినియోగం అధికంగా ఉండే వరి తదితర పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్సారెస్పీ కాలువల పూడికతీత, చెట్ల తొలగింపు పనులకు నియోజకవర్గానికి రూ.2 కోట్లు మంజూరు చేయించాలని సర్పంచులు కోరగా, కాలువల వద్ద అవసరమైన పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో గుడిసెలు ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే అన్నారు. సర్పంచులను అధికారులు గౌరవించి, వారి సమస్యలపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. విద్యుత్ ఏఈ పనితీరుపై సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు సమావేశాలకు గైర్హాజరవుతున్న అంశంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేసి, సస్పెన్షన్‌కు చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ మల్లేశ్వరిని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మడపల్లి కుమార్, తహసీల్దార్ సుంకర శ్రీనివాసులు, ఎంపీడీఓ పార్థసారథి, ఎంఏఓ షేక్ యాస్మిన్, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

# కదిలిన పంచాయతీ యంత్రాంగం

- రహదారుల వెంట చెత్త కుప్పల తొలగింపు
- వీధుల్లో దోమల నివారణకు ముమ్మరంగా ఫాగింగ్
- డ్రైనేజీల్లో పూడి కతీత.. ఇంటింటికీ చెత్త సేకరణకు చర్యలు
- స్పందించిన అధికారులకు గ్రా ప్రజల కృతజ్ఞతలు


కాకతీయ
పారిశుద్ధ్యం గాలికి.. ప్రజల ఆరోగ్యం ప్రశ్నార్థకం





కాకతీయ, రాయపర్తి : మండల కేంద్రంలో పారిశుద్ధ్య లోపాలు, రహదారుల పక్కన పేరుకుపోయిన చెత్త, దోమల బెడదపై 'కాకతీయ'లో ప్రచురితమైన కథనంతో పంచాయతీ యంత్రాంగం కదిలింది. ఆగస్టు 6న 'పారిశుద్ధ్యం గాలికి.. ప్రజల ఆరోగ్యం ప్రశ్నార్థకం' శీర్షికన ప్రచురితమైన కథనంపై సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి, పంచాయతీ కార్యదర్శి యాకూబ్ నాయక్ స్పందించారు. సిబ్బందిని అప్రమత్తం చేసి పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. వరంగల్–ఖమ్మం జాతీయ రహదారితో పాటు పలు వీధుల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, చెత్తను ట్రాక్టర్లతో తొలగించారు. డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టి మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా వ్యాప్తిని అరికట్టేందుకు గ్రామంలోని వీధుల్లో ఫాగింగ్ నిర్వహించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు.

### సమస్యపై స్పందించిన 'కాకతీయ'

తమ సమస్యను పత్రికా ముఖంగా వెలుగులోకి తీసుకువచ్చి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'కాకతీయ'కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. సమస్య చిన్నదైనా, పెద్దదైనా పత్రిక దృష్టికి తీసుకెళ్తే అధికారుల్లో కదలిక వస్తుందనే నమ్మకం మరింత బలపడిందని వారు పేర్కొన్నారు.

# ఆర్టీసీ పరిరక్షణకు ఎస్‌డబ్ల్యూఎఫ్‌ను బలపరచండి







- 38 వేల మంది కార్మికుల భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు
- కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం
- పెరిగిన పనిభారాలను వెంటనే తగ్గించాలి
- ఈడీల కమిటీ అంగీకరించిన అంశాలను అమలు చేయాలి
- సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు

కాకతీయ, ఖమ్మం : ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మిక హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్)ను రానున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు బలపరచాలని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు పిలుపునిచ్చారు. ఆర్టీసీలోని 38 వేల మంది కార్మికుల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రభుత్వ, యాజమాన్య అనుకూల సంఘాలకు కాకుండా కార్మికుల పక్షాన నిలిచే సంఘానికి మద్దతు ఇవ్వాలని కోరారు. బుధవారం ఖమ్మంలోని మంచికంటి హాల్‌లో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో సాయిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

### పోరాటాల చరిత్ర ఎస్‌డబ్ల్యూఎఫ్‌దే

2019లో అప్పటి ప్రభుత్వం కార్మిక సంఘాలపై ఆంక్షలు విధించిన సమయంలో ఆర్టీసీలోని అనేక సంఘాలు మౌనం వహించాయని, ఎస్‌డబ్ల్యూఎఫ్ మాత్రం తన శక్తిమేరకు కార్మిక సమస్యలపై స్పందించి పోరాటాలు నిర్వహించిందని సాయిబాబు అన్నారు. ఆ సంఘం సుదీర్ఘంగా నిర్వహించిన పోరాటాల ఫలితంగానే 2026లో సమ్మె జరిగిందని పేర్కొన్నారు. రానున్న గుర్తింపు ఎన్నికల్లో కార్మికుల వైపు నిలిచే సంఘం కావాలా.. ప్రభుత్వానికి, యాజమాన్యానికి అనుకూలంగా ఉండే సంఘం కావాలా అన్నది కార్మికులు ఆలోచించాలని సూచించారు. ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసి ఏళ్లు గడుస్తున్నా పలువురికి రిటైర్మెంట్ ప్రయోజనాలు అందకపోవడం బాధాకరమన్నారు. సంస్థకు నష్టాలు వస్తున్నాయంటూ కార్మికులపై పనిభారం పెంచడం సరికాదన్నారు. పెరుగుతున్న డీజిల్, బస్సు విడిభాగాల ధరలు ప్రభుత్వ విధానాల ఫలితమేనని, వాటి భారాన్ని కార్మికులపై మోపడం సమంజసం కాదని అన్నారు. పెంచిన పనిభారాలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

### విలీనం అంశంపై స్పష్టమైన వైఖరి

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఆర్టీసీ కార్మికుల పని పరిస్థితులు, పెరిగిన పని భారాలు, కార్మిక సమస్యలపై వివిధ యూనియన్ల వైఖరి, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, యాజమాన్యం అంగీకరించిన అంశాల అమలుపై వివరించారు. ప్రభుత్వం అంగీకరించిన ఆర్టీసీ కార్మికుల విలీనం అంశంపై సమగ్ర అధ్యయనం చేసి స్పష్టమైన వైఖరితో ఉన్న ఏకైక సంఘం ఎస్‌డబ్ల్యూఎఫ్ అని తెలిపారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్‌లో నియమితులైన వారిని అపాయింట్‌మెంట్ తేదీ నుంచే రెగ్యులర్ చేయాలని చర్చల్లో అంగీకరింపజేశామని చెప్పారు. సహజ మరణానికి కూడా రూ.10 లక్షల ప్రయోజనం అందేలా యాజమాన్యంతో చర్చించి యూబీఐ ద్వారా ఒప్పించామని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు కేవలం కండక్టర్లకే కాకుండా డ్రైవర్లు, మెకానికల్ కేటగిరీ ఉద్యోగులు కూడా పరీక్ష రాసే అవకాశం కల్పించేలా ఒప్పించామని పేర్కొన్నారు. రానున్న గుర్తింపు ఎన్నికల్లో గెలిచిన సంఘానికి విలీనం కమిటీలో ప్రాతినిధ్యం కల్పిస్తామని యాజమాన్యం ప్రకటించిందన్నారు.

### ఆర్టీసీని కాపాడాలి

సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నప్పటికీ ఆర్టీసీ పరిరక్షణకు తాము వ్యతిరేకం కాదన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, నిర్వహణ బాధ్యతలను ఆర్టీసీలకే అప్పగించి, అవసరమైన ఆర్థిక సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రజా రవాణా సంస్థ అయిన ఆర్టీసీని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం పలు తీర్మానాలు చేసింది. ఆర్టీసీలో ఈడీల కమిటీ అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలని, పెంచిన 80 శాతం అలవెన్సులకు సంబంధించిన సర్క్యులర్‌ను విడుదల చేయాలని, జూనియర్ అసిస్టెంట్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారందరికీ వెంటనే పోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేసింది. సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 25న డిపోలు, రీజియన్ కేంద్రాల్లో నిరాహార దీక్షలు చేపట్టాలని తీర్మానించింది.

### ఖమ్మంలో కార్మికుల ప్రదర్శన

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా ఖమ్మం పాత బస్టాండ్ నుంచి బస్ డిపో మీదుగా మంచికంటి హాల్ వరకు ఆర్టీసీ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. బ్రెడ్ విన్నర్స్ స్కీమ్‌లో నియమితులైన వారిని అపాయింట్‌మెంట్ తేదీ నుంచే రెగ్యులర్ చేయాలని, ఈడీల కమిటీ అంగీకరించిన అంశాలను అమలు చేయాలని, 80 శాతం పెంచిన అలవెన్సులకు సర్క్యులర్ విడుదల చేయాలని, జూనియర్ అసిస్టెంట్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారందరికీ పోస్టింగులు ఇవ్వాలని నినాదాలు చేశారు. ప్రదర్శనలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ లింగమూర్తి, సీఐటీయూ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్యాణం వెంకటేశ్వర్లు, తుమ్మ విష్ణువర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాణాల రాంబాబు, వేము జాకబ్, ఖమ్మం రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు మాధవరావు, పిట్టల సుధాకర్, ఆర్టీసీ శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ జె.పద్మావతి, ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ రీజియన్ల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

- దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సంక్షేమ ఫలాలు అందిస్తాం : మంత్రి పొంగులేటి
- ఉచితంగా త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్ల పంపిణీ
- ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపు



కాకతీయ, ఖమ్మం : దివ్యాంగుల సంక్షేమంతో పాటు వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీపై సమకూర్చిన త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా స్వశక్తితో జీవించేందుకు అవసరమైన సహాయ ఉపకరణాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. రవాణా సౌకర్యాన్ని సులభతరం చేసేందుకు ట్రై మోటార్ సైకిళ్లు ఉపయోగపడతాయని తెలిపారు. దివ్యాంగత్వాన్ని వైకల్యంగా భావించకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.

### స్వయం సమృద్ధి సాధించాలి

పట్టుదల, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే జీవితంలో సాధించలేనిది ఏదీ లేదని మంత్రి అన్నారు. దివ్యాంగులు సమాజంలో స్వయం సమృద్ధి సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి దివ్యాంగుడికి ప్రభుత్వ పథకాలు, పింఛన్లు, ఇతర సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, దివ్యాంగ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి నిరుపేద
# కుటుంబానికి ఇళ్ల స్థలం

- పల్లెగూడెం సమగ్ర అభివృద్ధికి రూ.61.76 కోట్లు
- ప్రభుత్వ, అసైన్డ్ భూములను అర్హులకు కేటాయిస్తాం
- రూ.20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం: మంత్రి పొంగులేటి



కాకతీయ, ఖమ్మం : అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్ల స్థలం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పల్లెగూడెంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయిస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను గుర్తించిన వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### రూ.61.76 కోట్లతో అభివృద్ధి పనులు

పల్లెగూడెం సమగ్ర అభివృద్ధికి రూ.61.76 కోట్లతో వివిధ పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. గొల్లగూడెం నుంచి పల్లెగూడెం వరకు ఎన్‌ఎస్‌పీ కాల్వ గట్టుపై రూ.5.80 కోట్లతో మోడల్ సీసీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రూ.55 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

### కొత్త అంగన్‌వాడీ భవనానికి రూ.12 లక్షలు

రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని రెండు నెలల్లోనే నాణ్యతతో పూర్తి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులను మంత్రి అభినందించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షలతో నూతన అంగన్‌వాడీ భవనాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ జిల్లాలో 110 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరై, నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం తుది దశలో ఉందన్నారు. 20 చోట్ల వీవో భవనాలకు స్థల సమస్య ఉన్నట్లు గుర్తించామని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ యుగంధర్‌రావు, పీఆర్ ఎస్‌ఈ వెంకట్‌రెడ్డి, ఈఈ మహేష్‌బాబు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఏదులాపురం మునిసిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, పల్లెగూడెం సర్పంచ్ చుందూరి సుజన కృష్ణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఖమ్మం కాంగ్రెస్ పార్టీ

- గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను తమ ఖాతాలో వేసుకుంటున్నారు
- జీవోలు, మంజూరు ఉత్తర్వులతో కాంగ్రెస్ ప్రచారానికి బీఆర్‌ఎస్ కౌంటర్
- మార్కెట్ కూల్చివేతపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- ప్రజా సమస్యలు పరిష్కరించకుండా తప్పుడు ప్రచారం తగదు
- బీఆర్‌ఎస్ నాయకులు పగడాల నాగరాజు, ఆర్.జె.సి. కృష్ణ, బి.రెడ్డి నాగచంద్రారెడ్డి



కాకతీయ, ఖమ్మం బ్యూరో : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం అభివృద్ధికి మంజూరు చేసిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు తామే తీసుకొచ్చినవిగా ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్‌ఎస్ నాయకులు పగడాల నాగరాజు, ఆర్.జె.సి. కృష్ణ, బి.రెడ్డి నాగచంద్రారెడ్డి విమర్శించారు. ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ జీవోలు, మంజూరు ఉత్తర్వులు, అధికారిక పత్రాలను మీడియా ముందు ప్రదర్శించారు. ''మేం మాటలతో ఆరోపణలు చేయడం లేదు.. జీవోలు, మంజూరు ఉత్తర్వులు, అధికారిక ఆధారాలతో మాట్లాడుతున్నాం. మేం చెప్పింది తప్పని నిరూపించేందుకు కాంగ్రెస్ నాయకులు కూడా ఆధారాలతో రావాలి'' అని సవాల్ చేశారు.

### మున్నేరు పనులకు జీవోలే సాక్ష్యం

2023లోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మున్నేరు ఇరువైపులా సీసీ వాల్, మున్నేరుపై సస్పెన్షన్ బ్రిడ్జి, ఖమ్మం మెడికల్ కాలేజీ పరిధిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి కీలక పనులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత వాటిని కొనసాగించడం ప్రస్తుత ప్రభుత్వ బాధ్యతేనని, అయితే మంజూరు చేసిన పనులను తామే తీసుకొచ్చినట్లు చెప్పుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. ఖమ్మం నగర అభివృద్ధిలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాత్రను ప్రజలు మర్చిపోలేరని పేర్కొన్నారు. గొల్లపాడు ఛానల్ అభివృద్ధి, పార్కులు, ప్రధాన రహదారులు, సెంట్రల్ లైటింగ్, వైకుంఠధామాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, కూడళ్ల సుందరీకరణ, ప్రకాశ్‌నగర్ చెక్‌డ్యామ్ తదితర పనులు బీఆర్‌ఎస్ హయాంలో జరిగాయని గుర్తుచేశారు.

### మార్కెట్ విషయంలో ప్రజాధనం వృథా

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి బీఆర్‌ఎస్ హయాంలో సుమారు రూ.11.34 కోట్లు కేటాయించి షెడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ప్రస్తుతం వాటిని తొలగించి కొత్త మార్కెట్ నిర్మాణం చేపట్టడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. సుమారు రూ.10 కోట్లతో నిర్మించిన పనులను కూల్చివేసి, దాదాపు రూ.కోటి విలువైన షెడ్లను ధ్వంసం చేసి, అదే స్థలంలో రూ.150 కోట్లకు పైగా ఖర్చు చేయడం అవసరమా అని ప్రశ్నించారు. గతంలో ఖర్చు చేసిన నిధులు, కూల్చివేసిన ఆస్తుల విలువ, కొత్త మార్కెట్‌కు అయ్యే వ్యయం, పాత నిర్మాణాలను ఎందుకు వినియోగించలేదనే అంశాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### ఎస్‌ఆర్ రోడ్ బాధితులకు న్యాయం చేయాలి

ఎస్‌ఆర్ రోడ్ విస్తరణలో ప్రభావితమైన సుమారు 170 కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని కోరారు. ఇళ్ల ముందు ర్యాంపులు, మెట్లు తొలగించుకున్న కుటుంబాలకు హామీ ఇచ్చిన టి.డి.ఆర్ మంజూరు చేయాలని, ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ స్థలం లేదా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో బీఆర్‌ఎస్ హయాంలో స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేసి ప్రారంభించిన షాదీఖానా నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. మైనార్టీలకు ఇచ్చిన హామీ మేరకు షాదీఖానాను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. భూదాన్ బాధితులు, రఘునాథపాలెం సర్వే నంబర్ 20018 బాధితులు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, మహిళలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన పనులను తమ ఖాతాలో వేసుకోకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని హితవు పలికారు. ''మేం చేసిన పనులకు జీవోలు, మంజూరు ఉత్తర్వులు, ప్రభుత్వ రికార్డులు ఉన్నాయి. అవసరమైతే ప్రజల ముందూ వాటిని పెడతాం. మీరు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాం.. మాటలతో కాదు, ఆధారాలతో చర్చకు సిద్ధం'' అని బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ గ్రంథాలయ చైర్మన్ కమర్, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బుల్, మాటేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ బంగారంతో ఫైనాన్స్ సంస్థకు టోకరా

- ముగ్గురు నిందితుల అరెస్ట్.. సీసీఎస్ పోలీసుల చర్యలు
- 11 నకిలీ బంగారు ఉంగరాలు స్వాధీనం
- 35.8 గ్రాముల ఆభరణాలు.. విలువ సుమారు రూ.4 లక్షలు
- మరో ఇద్దరు పరారీ.. గాలింపు కొనసాగింపు

కాకతీయ, ఖమ్మం బ్యూరో : నకిలీ బంగారు ఆభరణాలను అసలైనవిగా చూపించి ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందుతూ మోసాలకు పాల్పడుతున్న ముఠాకు ఖమ్మం సీసీఎస్ పోలీసులు చెక్ పెట్టారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీసీఎస్ సీఐ ఎస్. రాజ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు సీసీఎస్ ఏసీపీ మహ్మద్ సర్వర్ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో నిందితులు నకిలీ బంగారు ఆభరణాలను సిద్ధం చేసుకుని వాటిని అసలైన బంగారంగా చూపిస్తూ నగరంలోని ముత్తూట్ గోల్డ్ లోన్ సంస్థల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందినట్లు వెల్లడైందని సీఐ తెలిపారు. ఈ కేసులో ఇసంపల్లి సాయివంశీ (34), షేక్ మహబూబ్ (33), జూపల్లి రాము (35)లను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి నుంచి 11 నకిలీ బంగారు ఉంగరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం బరువు 35.8 గ్రాములు కాగా, విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని తెలిపారు. కాగా ఈ కేసులో కొక్కిరేణి సందీప్ (27), ముండాడ రామచందర్ (39) పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని సీసీఎస్ పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో చురుకుగా పనిచేసిన ఎస్ఐ వంశీ, హెడ్ కానిస్టేబుల్ ఓం ప్రకాశ్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, హరి, జానీ, నరసింహారావు, శ్రీధర్, సతీష్ తదితరులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.



## నవీన్ నాయక్‌కు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నివాళి



కాకతీయ, కారేపల్లి: సింగరేణి మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లా నాయక్ కుమారుడు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వర్గీయ బానోత్ నవీన్ నాయక్ దశదిన కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరై నివాళులర్పించారు. నవీన్ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా నియోజకవర్గ పీసీసీ సభ్యులు వడ్డే నారాయణరావు, జిల్లా ఓబీసీ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, సింగరేణి మండల కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూరి రాంబాబు, సర్పంచ్ సంఘం అధ్యక్షులు భూక్యా రంజిత్ కుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి బానోత్ రామ్మూర్తి నాయక్, అడ్డగోడ ఐలయ్య, వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మద్దిని శ్రీనివాసరావు, గూగులోత్ హర్ష నాయక్, గోపాల్ నాయక్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ప్రపంచఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



కాకతీయ, నెల్లికుదురు: చరిత్రను సజీవంగా నిలిపి భావితరాలకు అందించేదే ఫోటోగ్రఫీ అని ఫోటోగ్రఫీ, వీడియోగ్రాఫర్ అసోసియేషన్ మండల అధ్యక్షులు కదారి వెంకటరమణ అన్నారు. ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాకస్ మండే డాగ్యూర్ జ్ఞాపకార్థంగా187 ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని మండల కేంద్రంలోఘనంగానిర్వహించి,జెండాఆవిష్కరించారు.తదుపరి మాజీ పిఎస్డిలకు శాలువాకప్పిసత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎటువంటి సన్నివేశానైన ఉన్నది ఉన్నట్లుగా భావోద్వేగాలను సజీవంగా చూపించేదే ఫోటోగ్రఫీ అని అన్నారు.నేటి ప్రస్తుత పరిస్థితులలో పెరిగిపోతున్న సాంకేతిక పరిజ్ఞానాన్నిసామాజిక మాధ్యమాల సహాయంతో ఫోటోగ్రాఫర్లకు పని తగ్గిందని, ఫోటో వీడియో గ్రాఫర్ అందరూ ఒకరికొకరు సహకారం అందించుకుంటూ సమాజంలో అభివృద్ధిలో ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరసింహ,కోశాధికారి సైదులు, నాగేంద్ర ప్రసాద్, వెంకన్న చారి, శ్రీధర్,శ్రీకాంత్ యాదవ్, నగేష్,వల్లపు నరేష్, ఉపేందర్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది విగ్రహం కూల్చివేతపై నిరసన

- నెక్కొండలో టిఆర్ఎస్ నేతల అరెస్టు
- శాంతియుత బంద్‌లో పాల్గొన్న మాజీ ఎంపీపీ, సర్పంచ్ లను పోలీస్ స్టేషన్‌కు తరలింపు



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం కూల్చివేతకు నిరసనగా నెక్కొండలో టిఆర్ఎస్ పార్టీ శాంతియుత బంద్ నిర్వహించింది. ర్యాలీ చేస్తున్న పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ ట్రిబ్యునల్ మెంబర్, మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్, నెక్కొండ సర్పంచ్ అభ్యర్థి కొమ్ము రమేష్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటుక సోమయ్య, మాజీ వైస్ ఎంపీపీ కర్పూరపు శ్రీనివాస్ సహా పలువురిని అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో సర్పంచ్ లు వెంకట్ నాయక్, కుమారస్వామి ఉపసర్పంచ్ లు సుమలత సదానందం, అశోక్, సుమన్ మాజీ సర్పంచ్ లు బొల్లెబోయిన వీరస్వామి, వడ్డే రజిత సురేష్, కొర్లపాటి శైలజ ప్రభాకర్, బాదవత్ స్వరూప రవి, లింగాల విజయ వెంకన్న ఇతర నాయకులు మెండె వెంకన్న, దేవనబోయిన వీరభద్రం, పోలిశెట్టి సత్యం, పోలిశెట్టి చరణ్, గొపగాని శ్రీకాంత్, బొడ్డుపల్లి రాజు శ్రావణ్, అబియాదవ్, దొనికెన రవి, లావుడ్యా రాజేందర్, వడ్డే మనోహర్, ఆకుల నరేష్, ఈదునూరి వెంకన్న, కందిక వెంకన్న, సాంబయ్య, సారయ్య, బానోతు లాలు, దరావత్ రాము, వీరస్వామి తదితరులు.

## బాల్య వివాహాలకు సహకరిస్తే చర్యలు తప్పవు

**ఆధార్‌లో పుట్టిన తేదీ మార్పు చేస్తే కఠిన చర్యలు**

**బాల్య వివాహ నిరోధక చట్టంపై మీ సేవ నిర్వాహకులకు అవగాహన**

**వయసు నిర్ధారణకు ఆధార్ ప్రామాణికం కాదు**

**పుట్టిన తేదీ, స్టడీ సర్టిఫికెట్లే ఆధారం : ఈడీఎం యుగంధర్**

కాకతీయ, మహబూబాబాద్ : బాల్య వివాహాలకు సహకరించే ఉద్దేశంతో ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీని అక్రమంగా మార్చే మీ సేవ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈడీఎం యుగంధర్ హెచ్చరించారు. బుధవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో మీ సేవ నిర్వాహకులకు బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈడీఎం యుగంధర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపించే తల్లిదండ్రులు, మధ్యవర్తులు కొంతమంది మీ సేవ నిర్వాహకుల సహకారంతో ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీలను మార్చుతున్నట్లు సమాచారం ఉందన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అక్రమంగా వయసు మార్చేందుకు సహకరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి కమలాకర్ మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం–2006 ప్రకారం బాల్య వివాహానికి సహకరించే ప్రతి ఒక్కరూ శిక్షకు అర్హులేనని తెలిపారు. కొందరు తల్లిదండ్రులు పిల్లలు చదువుకున్నప్పటికీ చదువుకోలేదని చెబుతూ ఆధార్‌లో పుట్టిన తేదీ మార్చి 18 ఏళ్లు నిండినట్లు చూపించి వివాహాలు జరిపిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి మీ సేవ కేంద్రాల వరకు ఎవరైనా సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వయసు నిర్ధారణకు ఆధార్ కార్డు ప్రామాణికం కాదని, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం లేదా స్టడీ సర్టిఫికెట్‌ను ప్రామాణికంగా పరిగణించాలని కమలాకర్ తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## ప్రజావాణి ఫిర్యాదుకు స్పందించిన జిల్లా విద్యాధికారి

- గంభీరావుపేట జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల పరిశీలన
- 180 మంది విద్యార్థులకు నాలుగు వాష్‌రూమ్‌లతో ఇబ్బందులు
- మరుగుదొడ్ల సమస్యకు పరిష్కార చర్యలు చేపట్టాలని సూచనలు
- నీటి వసతి, మధ్యాహ్న భోజనం, కంప్యూటర్ల పనితీరుపై ఆరా



నీటి సమస్యకు పరిష్కారం

కాకతీయ, గంభీరావుపేట : ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపై స్పందించిన జిల్లా విద్యాధికారి శ్రీమొండయ్య బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంలోని జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. పాఠశాలలో సుమారు 180 మంది విద్యార్థులు ఉండగా, వారికి కేవలం నాలుగు వాష్‌రూమ్‌లు మాత్రమే ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించారు. బాలురు, బాలికలు వేర్వేరుగా వాటిని వినియోగించాల్సి ఉండటంతో విద్యార్థులకు అసౌకర్యం కలుగుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వెస్ట్రన్ టాయిలెట్ల వినియోగంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి, వాటి స్థానంలో అవసరమైన మార్పులు చేపట్టేందుకు సూచనలు చేశారు. పాఠశాలలో నీటి లభ్యతపై ఆరా తీసిన డీఈఓ, తగిన పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులను మెరుగుపరచాలని తెలిపారు. అదేవిధంగా కంప్యూటర్ల పనితీరు, మధ్యాహ్న భోజన వసతులు, ఆహార నాణ్యత, పరిమాణంపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట స్థానిక ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

## ఆధార్ పార్టీతోనే బడుగులకు న్యాయం



- బీసీల ఐక్యతే సమాజ ప్రగతికి బలమైన పునాది
- 2028 ఎన్నికల్లో అధికారమే ప్రధాన లక్ష్యం
- 119 నియోజకవర్గాల్లో పోటీకి కార్యాచరణ
- యువతకు పార్టీలో అవకాశాలు కల్పిస్తాం: డా. ఈడ శేషగిరిరావు

కాకతీయ, హనుమకొండ : బహుజనులు రాజకీయ కూలీలు కాదని, ఆధార్ పార్టీతోనే బడుగులకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది డా. ఈడ శేషగిరిరావు అన్నారు. బీసీల ఐక్యతే సమాజ ప్రగతికి బలమైన పునాది అని పేర్కొన్నారు. బుధవారం హనుమకొండలోని నేచర్ 369 హోటల్‌లో నిర్వహించిన ఆధార్ పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలను రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆధార్ పార్టీ పనిచేస్తోందన్నారు. వెనుకబడిన వర్గాలు ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించడంతో పాటు మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. బీసీలకు వారి జనాభా నిష్పత్తి మేరకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని, సమాజ అభ్యున్నతి కోసం సంఘటితంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడే ఆసక్తి ఉన్న యువతకు ఆధార్ పార్టీలో అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీ చేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు గట్ల యుగేందర్ గౌడ్, ఎస్టీ సెల్ చైర్మన్ అలెం వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ చైర్మన్ ఆంబోజు బుద్దయ్య, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బండా రాజారాం, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మధు, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నీరటి సత్యం, జెట్టి శ్రీనివాస్, మల్లేష్, ప్రేమ్ దయిల్, బూర సైదారావు, నక్క అజయ్ పద్మశాలి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీడీ లక్ష్యాలను 100% సాధించాలి



- 30 ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ తప్పనిసరి
- మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ పరీక్షలు చేయాలి
- గుర్తించిన కేసుల్లో 80 శాతానికి పైగా చికిత్సలోకి తీసుకురావాలి
- ఆశా, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పని చేయాలి: డీఎంహెచ్ఓ డా. రాజా రెడ్డి

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : జాతీయ అసంక్రమిక వ్యాధుల నివారణ కార్యక్రమం (ఎన్‌సీడీ) లక్ష్యాలను నిర్ణీత గడువులోగా 100 శాతం సాధించాలని డీఎంహెచ్ఓ డా. బి. రాజా రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్‌సీడీ కార్యక్రమంపై ఆయన అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 ఏండ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. నెలాఖరులోగా 100 శాతం స్క్రీనింగ్ పూర్తి చేసి, గుర్తించిన కేసుల్లో 80 శాతానికి పైగా నిర్ధారణ చేసి చికిత్సలోకి తీసుకురావాలని ఆదేశించారు. స్క్రీనింగ్, రిఫరల్ కేసులను ఆరోగ్య కేంద్రాలకు తీసుకురావడంలో ఆశా కార్యకర్తల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి ఆశా కార్యకర్త తన పరిధిలోని ప్రతి ఇంటి ఎన్‌సీడీ ప్రొఫైల్‌ను సిద్ధంగా ఉంచాలని, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. స్క్రీనింగ్, నిర్ధారణ, చికిత్స వివరాలను రోజువారీగా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని, వైద్యాధికారులు వాటిని క్రాస్‌చెక్ చేయాలని డీఎంహెచ్ఓ సూచించారు. లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డా.సయ్యద్ ఇక్తిదార్ అహ్మద్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్లు ఆర్. ప్రకాష్, ఎన్. శ్రీనివాస్ కర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



కాకతీయ, శంకరపట్నం : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శంకరపట్నం మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు చౌడమల్ల సంపత్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో ఫోటోగ్రఫీకి ప్రత్యేక స్థానం ఉందని, చారిత్రక ఘట్టాలను భద్రపరచడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర కీలకమని కొనియాడారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు నూతన నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దొనికెన రాజయ్య, ప్రధాన కార్యదర్శి బొంగోని కుమార్, కోశాధికారి మొల్గూరి రమేష్, ఉపాధ్యక్షులు ఎస్.డి. గోరేమియా, మనోచారి, సలహాదారు గాజుల స్వామి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు బండారి తిరుపతి, గంట మహిపాల్, ఏనుగుల అనిల్ హాజరై ఫోటోగ్రాఫర్లకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

### డైనింగ్ హాల్ దారిలో చెట్ల పొదలు..

## విద్యార్థుల భద్రత గాలిలో!

- చెట్లు, కొమ్మలతో ఇబ్బందులు..
- పొంచి ఉన్న ప్రమాదం




కాకతీయ,శంకరపట్నం:కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యం కనిపిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలలోని డైనింగ్ హాల్‌కు వెళ్లే మార్గంలో చెట్లు, పొదలు విపరీతంగా పెరిగిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని కూడా ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. డైనింగ్ హాల్‌కు వెళ్లే సమయంలో విద్యార్థులకు చెట్ల కొమ్మలు, పొదలు అడ్డుగా వస్తుండటంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. చిన్నారులు గుంపులుగా ఆ మార్గంలో రాకపోకలు సాగించే సమయంలో కొమ్మలు తగలడం, జారిపడటం పాములు సంచరించడం వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందిగా మారిన చెట్లు, పొదలను వెంటనే తొలగించి మార్గాన్ని పూర్తిగా శుభ్రం చేయాలని వారు కోరుతున్నారు. పాఠశాల అధికారులు ఇప్పటికైనా స్పందించి డైనింగ్ హాల్‌కు వెళ్లే దారిని పరిశుభ్రంగా, సురక్షితంగా మార్చేందుకు తక్షణ చర్యలు చేపట్టి విద్యార్థులకు భద్రత కలిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

### క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

**విద్యార్థులకు చందన పిలుపు**



కాకతీయ, రుద్రంగి: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపెల్లి చందన సూచించారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన 'రోల్ మోడల్ విత్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో 'ఇన్‌స్పైర్' కార్యక్రమాన్ని నిర్వహించిన చందన, తన పాఠశాల విద్యా జ్ఞాపకాలను, గురువులు నేర్పిన విలువలను గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి నారాయణ, ఎంఈఓ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు సమ్మిరెడ్డి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కవిత, కోఆర్డినేటర్ సతీష్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మర్రిపెల్లి అంతయ్య, నాయకులు గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు రోజులుగా విద్యార్థుల ఆందోళన

- అంబేద్కర్ సెంటర్‌లో బైఠాయింపు
- శక్తి ఫ్రేమ్‌వర్క్‌లో విలీనంపై అభ్యంతరం
- జీవో 97ను పునఃపరిశీలించాలని డిమాండ్
- న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తాం



కాకతీయ, స్టేషన్ ఘన్‌పూర్ : పాలిటెక్నిక్ డిప్లొమా, ఐటీఐ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోని శక్తి ఫ్రేమ్‌వర్క్‌లో విలీనం చేసే ప్రతిపాదనను పునఃపరిశీలించాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళన బుధవారం నాలుగో రోజూ కొనసాగింది. తరగతులకు హాజరుకాకుండా శివునిపల్లి అంబేద్కర్ సెంటర్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. 'మా డిప్లొమా.. మా గుర్తింపు.. మా భవిష్యత్' అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యార్థులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రహదారిపై నుంచి వెళ్లాలని కోరినట్లు విద్యార్థులు తెలిపారు. అయితే ప్రభుత్వం నుంచి తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. దీంతో సుమారు గంటకు పైగా రోడ్డుపైనే బైఠాయించి నిరసన కొనసాగించారు.

### జీవో 97పై అభ్యంతరం

పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలను శక్తి ఫ్రేమ్‌వర్క్ కింద విలీనం చేసే ప్రతిపాదనపై ప్రభుత్వం పునరాలోచించాలని విద్యార్థులు కోరారు. జీవో నంబర్ 97పై తమకు అభ్యంతరాలు ఉన్నాయని, నిర్ణయం తీసుకునే ముందు విద్యార్థులు, విద్యావర్గాలతో సమగ్రంగా చర్చించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సాంకేతిక విద్యా సంస్థల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల విద్యా అవకాశాలు, భవిష్యత్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. సాంకేతిక విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను పరిష్కరించే వరకు తమ నిరసన కొనసాగుతుందని విద్యార్థులు తెలిపారు.

# రైల్వేకు రూ.9,450 కోట్లు.. రోడ్లకు మరో రూ.3,591 కోట్లు

- 410 కి.మీ. మేర కొత్త రైలు మార్గాలు
- 76 మిలియన్ టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం
- బిహార్‌లో 82.5 కి.మీ. ఎన్‌హెచ్-22 నాలుగు లేన్లుగా విస్తరణ
- ఏడు వంతెనలు.. మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు.. రెండు ఫ్లైఓవర్లు
- నాలుగు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర కేబినేట్ ఆమోదం

**న్యూఢిల్లీ :** దేశ రవాణా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన నాలుగు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. మొత్తం రూ.9,450 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 410 కిలోమీటర్ల మేర అదనపు రైలు మార్గాలు అందుబాటులోకి రానున్నాయి. అదే సమయంలో బిహార్‌లో ముజఫర్‌పూర్-సీతామఢి-సోన్బర్సా మార్గంలోని 82.578 కిలోమీటర్ల ఎన్‌హెచ్ 22ను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.3,590.73 కోట్ల ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**నాలుగు రైల్వే ప్రాజెక్టులు**

కొత్తగా ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టులను 2030-31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి ఒడిశాలోని భద్రక్ (రాణీతాల్) వరకు 173 కిలోమీటర్ల మేర నాలుగో లైన్ నిర్మించనున్నారు. భద్రక్-హరిదాస్‌పూర్ మధ్య 75 కిలోమీటర్ల మేర మరో నాలుగో లైన్ ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుమ్మిడిపూండి నుంచి తమిళనాడులోని గూడూరు వరకు 90 కిలోమీటర్ల మేర మూడో, నాలుగో లైన్లు నిర్మించనున్నారు. ఒడిశాలోని కటక్-పరదీప్ (బడబంధ) మధ్య 72 కిలోమీటర్ల మేర మూడో, నాలుగో లైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టులు పశ్చిమబెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులోని ఎనిమిది జిల్లాల పరిధిలో కొనసాగనున్నాయి.

**6,448 గ్రామాలకు మెరుగైన కనెక్టివిటీ**

రైల్వే లైన్ల విస్తరణతో సుమారు 6,448 గ్రామాలకు రైలు కనెక్టివిటీ మెరుగుపడనుంది. దాదాపు 60 లక్షల మంది ప్రజలు ప్రయోజనం పొందనున్నారు. బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంట్, ఇనుము-ఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైల్స్, ఆహార ధాన్యాల వంటి కీలక సరుకుల రవాణాకు ఈ మార్గాలు ఉపయోగపడనున్నాయి. అదనంగా ఏటా 76 మిలియన్ టన్నుల సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కేంద్రం అంచనా వేసింది. పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు కూడా కనెక్టివిటీ మెరుగుపడనుంది. కుల్దిహా వన్యప్రాణి అభయారణ్యం, భితర్‌కణిక జాతీయ ఉద్యానవనం, చాందీపూర్ బీచ్, పులికాట్ సరస్సు, నెలపట్టు పక్షుల అభయారణ్యం, లలిత్‌గిరి తదితర ప్రాంతాలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.




**చమురు దిగుమతులు తగ్గే అవకాశం**

రైల్వే విస్తరణతో పర్యావరణానికీ ప్రయోజనం కలుగుతుందని కేంద్రం తెలిపింది. ఏటా సుమారు 13 కోట్ల లీటర్ల చమురు దిగుమతులు తగ్గడంతోపాటు 65 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని అంచనా వేసింది. ఇది దాదాపు 2.60 కోట్ల చెట్లను నాటినంత ప్రయోజనంతో సమానమని పేర్కొంది. బిహార్‌లోని ముజఫర్‌పూర్-సీతామఢి-సోన్బర్సా మధ్య ఎన్‌హెచ్ 22ను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయనున్నారు. 82.578 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్‌ఏఎం)లో చేపట్టనున్నారు. దీని అంచనా వ్యయం రూ.3,590.73 కోట్లు. ఈ రహదారి భారత్-నేపాల్ సరిహద్దులోని సోన్బర్సాను ముజఫర్‌పూర్‌లోని ఎన్‌హెచ్ 27తో అనుసంధానిస్తుంది. ముజఫర్‌పూర్, బరౌనీ వంటి ఆర్థిక కేంద్రాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు గంగానది పరివాహక ప్రాంతంలోని సరుకు రవాణా కేంద్రాలకు అనుసంధానం బలోపేతం కానుంది. నేపాల్ సరిహద్దులోని భిఠామోర్ ల్యాండ్ పోర్టు ద్వారా ప్రయాణికులు, సరుకుల రాకపోకలకు ఈ రహదారి కీలకంగా మారనుంది.

**ఏడు వంతెనలు.. మూడు ఆర్వోబీలు**

ఎన్‌హెచ్ 22 విస్తరణలో ఏడు ప్రధాన వంతెనలు, మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, రెండు ఫ్లైఓవర్లను నిర్మించనున్నారు. బాగ్మతీ నదిపై 340 మీటర్ల పొడవైన ప్రధాన వంతెన ఇందులో ఉంది. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు 1,170 మీటర్లు, 270 మీటర్ల పొడవైన రెండు ఫ్లైఓవర్లు నిర్మించనున్నారు. ముజఫర్‌పూర్, ముక్సుద్‌పూర్, రున్నీ సైద్‌పూర్, తుమ్మా, డుమ్రా, భూతాహీ, సోన్బర్సా వంటి జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గి, రాకపోకలు వేగంగా, సురక్షితంగా సాగేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని కేంద్రం తెలిపింది.

# జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే

- భద్రత మెరుగుపడింది.. ప్రయాణ హెచ్చరికను సమీక్షిస్తాం
- 2019 తర్వాత తొలిసారి అమెరికా రాయబారి పర్యటన
- ఒమర్ అబ్దుల్లాతో ఆర్థిక సహకారంపై చర్చ
- 'మా సమస్యలు వాషింగ్టన్‌లో పరిష్కారం కావు' : ఒమర్



**శ్రీనగర్ :** జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని అమెరికా రాయబారి సెర్గియో గోర్ స్పష్టం చేశారు. కేంద్ర, జమ్మూకశ్మీర్ ప్రభుత్వాలు భద్రతను మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. ఈ నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌కు అమెరికా జారీ చేసిన ప్రయాణ హెచ్చరికను మరోసారి సమీక్షించే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా జమ్మూకశ్మీర్‌కు 'లెవల్ 4 డోంట్ ట్రావెల్' హెచ్చరికను జారీ చేసిన నేపథ్యంలో దానిని తగ్గించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో శ్రీనగర్‌లో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత, 2025లో పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో అమెరికా రాయబారి జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా గోర్ మాట్లాడుతూ జమ్మూకశ్మీర్ ఎంతో అందమైన ప్రాంతమని, ఇక్కడికి తొలిసారి రావడం ఆనందంగా ఉందన్నారు. ఒమర్ అబ్దుల్లాతో భేటీ స్నేహపూర్వకంగా, సానుకూలంగా సాగిందని తెలిపారు. సమావేశంలో చర్చించిన అంశాలను వాషింగ్టన్, దిల్లీలోని సంబంధిత వర్గాలతో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. జమ్మూకశ్మీర్‌ను మరింత సురక్షితంగా మార్చేందుకు కేంద్రం, స్థానిక ప్రభుత్వం అద్భుతమైన చర్యలు తీసుకున్నాయని గోర్ ప్రశంసించారు. తాజా భద్రతా పరిస్థితులను పరిశీలించిన అనంతరం అమెరికా ప్రయాణ హెచ్చరికను సమీక్షిస్తామని తెలిపారు. అయితే శ్రీనగర్ నుంచే హెచ్చరికలో మార్పుపై తుది ప్రకటన చేయలేనని స్పష్టం చేశారు.

**పర్యాటకం.. ఆర్థిక రంగంపై చర్చ**

అమెరికా-జమ్మూకశ్మీర్ మధ్య ఆర్థిక సంబంధాలను మరింత విస్తరించే అవకాశాలపై ఒమర్ అబ్దుల్లాతో చర్చించినట్లు గోర్ తెలిపారు. పర్యాటకం, ఉద్యానవన రంగం, నూతన ఆర్థిక వ్యవస్థలో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను చర్చించినట్లు ఒమర్ కూడా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. అమెరికా రాయబారితో భేటీ సంతోషకరంగా సాగిందని, జమ్మూకశ్మీర్-అమెరికా సంబంధాల విస్తరణకు ఈ చర్చలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గోర్ పర్యటనకు ముందు ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్ అంతర్గత వ్యవహారాలు పూర్తిగా భారత్‌కు సంబంధించినవేనని స్పష్టం చేశారు. తమ సమస్యలను మరో దేశ రాయబారికి ఫిర్యాదు చేయడం తనకు అలవాటు లేదన్నారు. జమ్మూకశ్మీర్ సమస్యలు వాషింగ్టన్‌లో పరిష్కారం కావని, భారత ప్రభుత్వంతోనే పరిష్కరించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా గోర్ బుధవారం శ్రీనగర్ చేరుకున్నారు. గురువారం లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. శ్రీనగర్‌లో వాణిజ్య, ఇతర సంఘాల ప్రతినిధులతోనూ సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఇటీవల ఉగ్రవాద నిరోధక చర్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ సెర్గియో గోర్ చర్చించారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతున్న సమయంలో ఆయన జమ్మూకశ్మీర్ పర్యటనకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఆయుష్ విద్యార్థుల స్టైఫండ్ సమస్య పరిష్కరించాలి

- అల్లోపతితో సమానంగా స్టైఫండ్ చెల్లించాలి
- పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు డిమాండ్
- ఎర్రగడ్డలో దీక్ష చేస్తున్న విద్యార్థులకు బీజేపీ సంఘీభావం

**కాకతీయ, హైదరాబాద్ :** ఆయుష్ వైద్య విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను తెలంగాణ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా ఆయుష్ పీజీ వైద్యులు, హౌస్ సర్జన్లకు స్టైఫండ్ చెల్లించడంతోపాటు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవించి ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఎర్రగడ్డలోని డాక్టర్ బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, ఆసుపత్రి ప్రాంగణంలో 16 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆయుష్ పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లను రాంచందర్‌రావు పరామర్శించి బీజేపీ తరఫున సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఆయుర్వేద, యునాని, హోమియోపతి వైద్య విధానాల్లో పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లు, ఇంటర్న్‌షిప్ చేస్తున్న వారికి స్టైఫండ్ విషయంలో గత కొన్నేళ్లుగా అన్యాయం జరుగుతోందని రాంచందర్‌రావు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006 నాటి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆయుష్, అల్లోపతి వైద్య విద్యార్థులను సమానంగా చూడాల్సి ఉందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016 నుంచి స్టైఫండ్ పెంపు నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఏపీలో రూ.60 వేలు..**

**తెలంగాణలో రూ.30 వేలు**

అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా ఆయుష్ పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లకు స్టైఫండ్ చెల్లించాలని న్యాయస్థానాలు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయని రాంచందర్‌రావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆయుష్ పీజీ విద్యార్థులకు నెలకు రూ.60 వేలు, హౌస్ సర్జన్లకు రూ.25 వేలు చెల్లిస్తుండగా.. తెలంగాణలో పీజీ విద్యార్థులకు రూ.30 వేలు, హౌస్ సర్జన్లకు రూ.13 వేలు మాత్రమే చెల్లించడం వివక్షకు నిదర్శనమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా పెండింగ్ ఎరియర్స్‌తో సహా పూర్తి స్థాయి స్టైఫండ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రత్యేకంగా ఆయుష్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి భారతీయ వైద్య విధానాలను ప్రోత్సహిస్తోందని రాంచందర్‌రావు అన్నారు. పొరుగు రాష్ట్రం అమలు చేస్తున్న విధానాన్ని తెలంగాణలో ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయుష్ వైద్యులకు సమాన స్టైఫండ్ ఇవ్వాలని అసెంబ్లీలో డిమాండ్ చేసిన ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి ఇప్పుడు అధికారంలో ఉండి కూడా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు.

**దీక్షలను విస్మరిస్తే ఉద్యమం**

ప్రజారోగ్య పరిరక్షణలో కీలక సేవలందిస్తున్న వైద్య విద్యార్థులు తమ న్యాయమైన హక్కుల కోసం 16 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని రాంచందర్‌రావు విమర్శించారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించి స్టైఫండ్ పెంచడంతోపాటు పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆయుష్ విద్యార్థుల పక్షాన బీజేపీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.



# పండ్ల వ్యాపారుల కష్టాలకు చెక్

- ఖానాపురం పండ్ల మార్కెట్‌కు రూ.17.72 కోట్లు
- రోడ్లపై విక్రయాలకు త్వరలో శాశ్వత పరిష్కారం
- 31 అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు
- మంత్రి తుమ్మల కృషికి యూనియన్ నాయకుల కృతజ్ఞతలు

**కాకతీయ, ఖమ్మం బ్యూరో :** ఖమ్మం నగరంలోని పండ్ల వ్యాపారుల కష్టాలకు త్వరలో శాశ్వత పరిష్కారం లభించనుంది. ఖానాపురం హవేలీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ యార్డు అభివృద్ధి, నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.17.72 కోట్ల నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయి. గతంలో పనులు సగంలో నిలిచిపోవడంతో వ్యాపారులు రోడ్లపైనే పండ్ల విక్రయాలు నిర్వహిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 202627 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.1,772 లక్షల పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఇందులో షాపింగ్ కాంప్లెక్స్‌లు, ట్రేడర్స్ షాపులు, కవర్ షెడ్లు, సీసీ ఫ్లోరింగ్, రోడ్లు, కాంపౌండ్ వాల్, టాయిలెట్ బ్లాక్, రైతుల విశ్రాంతి భవనం, విద్యుత్ సదుపాయాలు తదితర 31 పనులు చేపట్టనున్నారు.

**వ్యాపారులకు మెరుగైన వసతులు**

60 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఎలక్ట్రానిక్ వెయింగ్ బ్రిడ్జి, 90 వేల లీటర్ల ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్, టవర్ లైట్లు, విద్యుదీకరణ పనులు చేపట్టనున్నారు. యార్డు పూర్తయితే వ్యాపారులు రోడ్లపై కాకుండా ఒకేచోట తమ కార్యకలాపాలు నిర్వహించుకునే అవకాశం కలుగుతుంది. కొనుగోలుదారులకు కూడా మెరుగైన వాతావరణం అందుబాటులోకి రానుంది. మార్కెట్ నిర్మాణం పూర్తికాకపోవడంతో వర్షాలు, ఎండలు, ట్రాఫిక్, పారిశుద్ధ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని పండ్ల వ్యాపారులు తెలిపారు. తమ సమస్యను పరిష్కరించేందుకు రూ.17.72 కోట్లు మంజూరు చేయించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ తుమ్మల యుగంధర్‌ను పండ్ల మార్కెట్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరారు.

# 2 వేల మందిని అన్‌ఫిట్ చేయాలి

- సింగరేనిలో వారసులకు ఉద్యోగాలు వచ్చే వరకు పోరాడతాం
- ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్

**కాకతీయ, హైదరాబాద్:** సింగరేణిలో అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న 2 వేల మంది కార్మికులను మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్ చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. వారందరి దరఖాస్తులు పరిష్కారమయ్యే వరకు ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించాలని కోరారు. హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, మాజీ మంత్రి బోడ జనార్ధన్‌తో కలిసి బుధవారం ఆమె వీడియో సందేశం విడుదల చేశారు. గత నెలలో హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ హెచ్చరికలతో ప్రభుత్వం మెడికల్ బోర్డు ఏర్పాటు చేసిందని, ఒక్క నెలకే పరిమితం చేయడం సరికాదన్నారు. మెడికల్ బోర్డు కోసం నిరవధిక దీక్ష చేస్తామని హెచ్చరించిన నేపథ్యంలోనే ప్రభుత్వం స్పందించిందన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో కార్మికులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. అలియాస్ పేర్ల కారణంగా ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్న యువమిత్రులకు కూనంనేని సాంబశివరావు అన్యాయం చేస్తున్నారని కవిత ఆరోపించారు. ఉద్యోగాల కోసం నిరాహార దీక్ష చేస్తున్న వారికి హామీ ఇవ్వకుండా ఎలా దీక్ష విరమింపజేస్తారని ప్రశ్నించారు. అలియాస్ పేర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

# ఫీనిక్స్ నుంచి పొంగులేటికి ఆస్తులు

- కంపెనీ నుంచి మంత్రికి రూ.15వేల కోట్ల ఆస్తుల బదలాయింపులు
- ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నా
- దమ్ముంటే చర్చకు రావాలి
- 22ఏ భూముల వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ఫీనిక్స్ కంపెనీ నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సుమారు రూ.15 వేల కోట్ల విలువైన ఆస్తులు బదలాయింపులు జరిగాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని, వాటితో మంత్రి పొంగులేటితో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. దమ్ము, ధైర్యం ఉంటే గురువారం మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల మధ్య అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రావాలని కోరారు. కాంగ్రెస్-బీఆర్ఎస్ కలిసి సాగిస్తున్న 'జాయింట్ వెంచర్ లూట్'పై సీబీఐ, ఈడీతో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**ఫీనిక్స్–రాఘవ సంస్థల మధ్య లావాదేవీలు**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ సంస్థలు, బీఆర్ఎస్‌కు బినామీగా పనిచేసిన ఫీనిక్స్ కంపెనీ మధ్య భారీ క్విడ్‌ప్రోకో జరిగిందని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంత్రి అయిన తర్వాత నానక్‌రామ్‌గూడ, పుప్పాలగూడ, నార్సింగి, కోకాపేట్, హైటెక్‌సిటీ ప్రాంతాల్లోని టీజీఐఐసీ పారిశ్రామిక భూములను రెసిడెన్షియల్ జోన్లుగా మార్చారని అన్నారు. అనంతరం ఫీనిక్స్ నుంచి సుమారు రూ.15 వేల కోట్ల విలువైన ఆస్తులు పొంగులేటికి చెందిన సంస్థలకు బదలాయించుకున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన పత్రాలు, ఆధారాలు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అధికారంలోకి రాకముందు ఫీనిక్స్‌పై సీబీఐ, ఈడీ విచారణ జరిపిస్తామని, ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను అడ్డం పెట్టుకుని గత పాలకులతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం 'జాయింట్ వెంచర్ లూట్'కు పాల్పడుతోందని ఆరోపించారు.

**22ఏ భూములపై శ్వేతపత్రం**

రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితా పేరుతో లక్షల కోట్ల విలువైన భూములను వివాదాస్పదంగా మార్చి బేరసారాలకు తెరతీశారని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో చేర్చిన వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి స్వయంగా క్షమాపణ చెప్పడం ద్వారా ఈ వ్యవహారంలో భారీ తప్పిదాలు జరిగినట్లు స్పష్టమవుతోందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం యాదాద్రిలోని తన 42 ఎకరాల భూమి 22ఏ జాబితాలోకి వెళ్లిందని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని చెప్పిన విషయాన్ని మహేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. 22ఏ భూముల వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

**పొంగులేటికి బహిరంగ సవాల్**

భూదందాలు, ఆస్తుల బదలాయింపులపై అన్ని ఆధారాలతో చర్చకు సిద్ధంగా ఉన్నానని మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. రూ.1,400 కోట్ల పాలమూరు-రంగారెడ్డి కాంట్రాక్టును రూ.4,300 కోట్లకు రివైజ్ చేసుకోవడం కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రెస్ట్ కాదా? అని ప్రశ్నించారు. గురువారం మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆధారాలతో వేచి ఉంటానని.. దమ్ము, ధైర్యం ఉంటే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ చేశారు. ఈ వ్యవహారంపై ఈడీ, సీబీఐ, లోకాయుక్తకు ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి కూడా బహిరంగ లేఖ రాస్తామని తెలిపారు. కాంగ్రెస్-బీఆర్ఎస్ భూదందాలు, అవినీతిపై బీజేపీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణలో దూసుకెళ్తున్న ఈవీలు

- రాయితీలతో పెరిగిన కొనుగోళ్లు..
- ఏడాదిలో 91,107 వాహనాలు
- కొత్త వాహనాల నమోదులో 8.8 శాతం వాటా
- కార్లలో ఈవీల వాటా 12.5 శాతం
- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌లోనే 68 శాతం నమోదు



**కాకతీయ, హైదరాబాద్:** తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ముఖ్యంగా రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులపై 100 శాతం మినహాయింపుతో ఈవీల కొనుగోళ్లకు భారీగా ఊతమిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 91,107 ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్టర్ కాగా.. వీటి మొత్తం ఇన్‌వాయిస్ విలువ రూ.6,283 కోట్లుగా ఉంది. మొత్తం కొత్త వాహనాల నమోదులో ఈవీల వాటా 8.8 శాతానికి చేరింది. కార్ల విభాగంలో ఈ వాటా ఏకంగా 12.5 శాతంగా నమోదవడం ఈవీలకు పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా మారింది. మరోవైపు 243 ఎలక్ట్రిక్ బస్సులు కూడా రోడ్డెక్కాయి.

**జీఓ 41తో భారీ ఊతం**

ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2024 నవంబరు 16న జీఓ 41 జారీ చేసింది. దీని ప్రకారం ఈవీలపై రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులో 100 శాతం మినహాయింపు కల్పించింది. గతంలో వాహనాల సంఖ్యపై ఉన్న పరిమితులను తొలగించి.. సంఖ్యతో సంబంధం లేకుండా ఈ రాయితీని వర్తింపజేశారు. ట్యాక్సీలు, ప్రైవేటు కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, టూరిస్టు క్యాబ్‌లు, తేలికపాటి గూడ్స్ వాహనాలు, మూడు సీట్ల ఆటోలు, ఎలక్ట్రిక్ ట్రాక్టర్లకు ఈ మినహాయింపు వర్తిస్తోంది. ప్రభుత్వ సంస్థలు ఉద్యోగుల కోసం నడిపే వాహనాలకు కూడా ఈ ప్రయోజనం అందుతోంది.

**గ్రేటర్ పరిధిలోనే 68 శాతం**

రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలు ముందంజలో ఉన్నాయి. ఈ మూడు జిల్లాల్లోనే మొత్తం ఈవీ నమోదుల్లో సుమారు 68 శాతం నమోదయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో ఉండటం, నగర జీవనశైలికి అనుగుణంగా ఈవీల వినియోగం పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా అధికారులు భావిస్తున్నారు. ఛార్జింగ్ మౌలిక వసతులు మరింత విస్తరితే ఈవీల మార్కెట్ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ వేగంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**పండుగ ఆఫర్లతో పెరిగిన డిమాండ్**

నెలల వారీగా చూస్తే అక్టోబరు, ఫిబ్రవరిలో ఎలక్ట్రిక్ వాహనాల నమోదులు అధికంగా ఉన్నాయి. ఒక్క అక్టోబరులోనే 10,705 ఈవీలు రిజిస్టర్ అయ్యాయి. దసరా, దీపావళి సందర్భంగా వాహన తయారీ సంస్థలు ప్రకటించిన ప్రత్యేక ఆఫర్లు కూడా కొనుగోళ్లను పెంచినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 18,852 ఎలక్ట్రిక్ కార్లు నమోదయ్యాయి. 2025-26లో కార్ల విభాగంలో ఈవీల వాటా మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

**ఛార్జింగ్ మౌలిక వసతులపై దృష్టి**

ఈవీల వినియోగం వేగంగా పెరుగుతున్నప్పటికీ ఛార్జింగ్ స్టేషన్ల కొరత ప్రధాన సవాలుగా మారుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ వెలుపల ఛార్జింగ్ మౌలిక వసతులను విస్తరించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య పెరిగితే ప్రజల్లో ఉన్న ఆందోళనలు తగ్గి.. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం మరింత విస్తరించే అవకాశం ఉంది. మొత్తంగా పన్ను రాయితీలు, పెరుగుతున్న మోడళ్ల సంఖ్య, పర్యావరణంపై అవగాహన, ఇంధన ఖర్చుల ఆదా వంటి అంశాలు తెలంగాణలో ఈవీ మార్కెట్ వేగంగా ఎదగడానికి దోహదం చేస్తున్నాయి.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266